# పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :250 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి గురువారం 17 సెప్టెంబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :250 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI THU 17 SEPTEMBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


# లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

## ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు

- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి" అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు.స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

- తిరుమలను ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక నమూనాగా తీర్చిదిద్దుతామన్న సీఎం
- రూ.104 కోట్లతో ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి
- తిరుమల వచ్చే ప్రతి భక్తుడికి రూ.2 లక్షల బీమా సౌకర్యం
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం

2లో



# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. "చంద్రబాబు గారి రెడ్ బుక్

- మిగతా 2లో






## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చంద్రబాబు సంక్షేమ డ్రామా ఆడుతున్నారని వైసీపీ విమర్శ
- కొత్త ప్రభుత్వం వచ్చాక అర్హులకు పెన్షన్లు ఇవ్వడం లేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపణ
- దాదాపు 6 లక్షల మంది పెన్షన్ లబ్ధిదారులను తొలగించారని విమర్శ
- జగన్ తెచ్చిన జీవోతోనే అసైన్డ్ భూములకు హక్కులు దక్కుతున్నాయని వెల్లడి
- కేంద్రం కేటాయించిన ఇళ్లు నామమాత్రమేనని వ్యాఖ్య

- మిగతా 2లో

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- డిశ్చార్జ్ పిటిషన్లు వేసిన గంగిరెడ్డి, ఉమాశంకర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి
- పిటిషన్లకు విచారణార్హత లేదన్న కోర్టు
- నిందితులపై అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో నాంపల్లిలోని ప్రత్యేక సీబీఐ కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. తమపై నమోదైన తీవ్ర అభియోగాల నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ ప్రధాన నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లను న్యాయస్థానం నిర్ద్వంద్వంగా

- మిగతా 2లో





## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు..

# 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- 2013లో కాంగ్రెస్ పార్టీ పరివర్తన్ యాత్రపై దాడి
- మావోల దాడిలో 29 మంది దుర్మరణం
- 10 మంది మావోలకు ఉరిశిక్ష విధించిన ఎన్ఐఏ న్యాయస్థానం


**పెన్ పవర్ డెస్క్:**ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా జీరం ఘాటీ వద్ద 2013లో కాంగ్రెస్ 'పరివర్తన్ యాత్ర' కాన్వాయ్‌పై దాడి చేసిన మావోయిస్టులు 29 మందిని అతి దారుణంగా హత్య చేయడం సంచలనం సృష్టించింది. తాజాగా, ఈ దాడి కేసులో జగదల్‌పూర్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన మొత్తం 10 మంది మావోయిస్టులకు

- మిగతా 2లో

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

- ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం
- శనివారం సాయంత్రానికి అల్పపీడనం ఏర్పాటుకు సూచనలు
- ఉత్తరాంధ్ర - దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం
- ప్రభావంతో వచ్చే వారం రాష్ట్రంలో వర్షాలు కురిసే ఛాన్స్
- రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అధికారిక వెల్లడి

- మిగతా 2లో







## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

- భార్య ముక్కు కొరికేసిన భర్త
- మంచిర్యాల జిల్లాలో జరిగిన దారుణ ఘటన
- కాపురానికి రావడం లేదన్న కోపంతో భర్త దాడి
- అడ్డువచ్చిన మామపై కూడా కర్రతో దాడి
- వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి బాధితురాలు తరలింపు

- మిగతా 2లో



## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

### నెల్లూరులో ఆధునిక పాఠశాలలను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- నెల్లూరులో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్, డీఎస్ఆర్ ప్రభుత్వ స్కూళ్లను ప్రారంభించిన మంత్రి
- వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ స్కూల్‌కు కార్పొరేట్ హంగులు
- డిజిటల్ తరగతులు, రోబోటిక్స్ ల్యాబ్, సింథటిక్ క్రీడా ప్రాంగణం వంటి ప్రత్యేకతలు
- పాఠశాల పనితీరుపై సమీక్ష.. ఉత్తీర్ణత శాతం పెంచాలని అధికారులకు లోకేశ్ ఆదేశం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, ఇతర టీడీపీ నేతలు

**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా నెల్లూరు నగరంలో మరో ముందడుగు పడింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో

- మిగతా 2లో

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు



- కేంద్ర విమోచన వేడుకలకు అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరణ
- రాష్ట్రంలో 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహణ
- సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వేడుకలు

- మిగతా 2లో

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

**పెన్ పవర్ డెస్క్:** సంగారెడ్డి జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదఛాయలు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రావాలి అవంతి అంటున్న వైసీపీ !

నాకొద్దీ పార్టీ అని మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు ఇప్పటికి రెండేళ్ళ క్రితం వైసీపీని వీడిపోయారు. చిత్రంగా ఇపుడు వైసీపీకి ఆయనే అవసరం అవుతున్నారు అని అంటున్నారు. భీమునిపట్నం వైసీపీ ఇంచార్జిగా ఉన్న చిన్న శ్రీను టీడీపీలో చేరిపోయారు. ఆయన పార్టీని వీడి పది రోజులకు దగ్గర పడుతున్నా భీమిలీ వైసీపీ ఇంచార్జిగా ఎవరిని ఎంపిక చేయాలో తెలియక ఆ పార్టీ సతమతం అవుతోంది. వైసీపీకి భీమిలీ ఇపుడు అతి పెద్ద పరీక్ష పెడుతోంది. విజయనగరం జిల్లా వైసీపీ అధ్యక్షుడిని, అలాగే నెల్లిమర్ల వైసీపీ ఇంచార్జిని వెంటనే నియమించిన వైసీపీ అధినాయకత్వం భీమిలీ విషయంలో మాత్రం ఏమీ పాలుపోక ఆగిపోయిందా అన్న చర్చ వస్తోంది. ఎందుకంటే భీమిలీ టీడీపీకి కంచుకోట. అక్కడ వైసీపీని నడపడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. అందుకే అర్ధబలం అంగబలం ఉన్న నేతల కోసం పార్టీ చూస్తోంది.

**వైసీపీ సర్వేలో ఆయనే :**

ఇదిలా ఉంటే భీమిలీ నియోజకవర్గానికి కొత్త వైసీపీ ఇంచార్జిగా ఎవరిని నియమించాలి అన్న దాని మీద పార్టీ అంతర్గత సర్వే నిర్వహిస్తే మెజారిటీ క్యాడర్ తో పాటు నాయకులు అంతా అవంతికి జై కొట్టారని తెలుస్తోంది. అవంతి 2019 నుంచి 2024 మధ్యలో వైసీపీలో ఎమ్మెల్యేగా మంత్రిగా పనిచేశారు. విశాఖ వైసీపీ జిల్లా అధ్యక్షుడుగా ఆయన ఉన్నారు. ఆయన బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పాటు అంగబలం అర్ధ బలానికి లోటు లేదు. ఇక 2009లో ప్రజా రాజ్యం నుంచి ఒకసారి ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. అలా ఆయనకంటూ సొంత బలం అనుచర గణం ఉంది. అందువల్ల ఆయనకే పార్టీ బాధ్యతలు అప్పగిస్తే భీమిలీలో కూటమిని ధీటుగా ఎదుర్కొంటారు అని అంటున్నారు. ఇది భీమిలీ మెజారిటీ వైసీపీ నేతల మాటగా ఉంది.

**ఇంతకీ ఆయన వస్తారా :**

అయితే ఇదంతా ఒంటి చేతి చప్పుడు మాదిరిగానే ఉంది అంటున్నారు. వైసీపీ తన సర్వేలు తాను చేస్తోంది. అందులో అవంతి పేరు కూడా జోడించింది. అందరూ అవంతి కావాలని కోరుతున్నారు. అంతవరకూ బాగానే ఉంది కానీ ఇంతకీ అవంతి శ్రీనివాసరావు వైసీపీలోకి తిరిగి చేరుతారా అన్నదే పెద్ద చర్చగా ఉంది. ఆయన 2024 డిసెంబర్ లో వైసీపీకి రాజీనామా చేశారు. అప్పట్లో ఆయన ఆలోచనలు కూటమిలో చేరాలని. అందుకే వైసీపీ మేయర్ ని దించడానికి కార్పోరేటర్ గా ఉన్న తన కుమార్తె చేత కూడా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేయించి టీడీపీ కూటమికి జీవీఎంసీ దక్కేలా చేశారు. అయితే టీడీపీలో ఆయన రాకను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యతిరేకించడంతో ఆగింది అని అంటున్నారు.

**తగిన మూల్యం చెల్లిస్తోంది :**

జనసేనలో ఆయనను చేర్చుకోవడానికి కూడా స్థానికంగా అంగీకారం లేదని చెబుతున్నారు. ఈ కారణాల వల్లనే ఆయన ప్రస్తుతం ఖాళీగా ఉన్నారు అని అంటున్నారు. డీలిమిటేషన్ మీద అవంతి ఆశలు పెట్టుకున్నారు. సీట్లు పెరిగితే కనుక కూటమి పార్టీలలో చేరి మళ్ళీ పోటీ చేయాలని చూస్తున్నారు. ఈ నేపథ్యంలో అవంతి వైసీపీలో చేరుతారు అన్నది ఎంతవరకూ జరుగుతుంది అన్నది పెద్ద ప్రశ్నగా ఉంది. ఒకవేళ మనసు మార్చుకుని అవంతి వైసీపీలో చేరితే మాత్రం వైసీపీకి గండం గట్టెక్కినట్లే అంటున్నారు. మొత్తానికి చూస్తే గతంలో వైసీపీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. కానీ ఎన్నికల వేళ వారిని అందరినీ దూరం చేసుకున్న పాపానికి ఇపుడు వైసీపీ తగిన మూల్యం చెల్లిస్తోంది అని అంటున్నారు.

## ప్రైవేటుకు దీటుగా సర్కారీ బడులు..

- మొదటి పేజి తరువాయి

అత్యంత ఆధునికంగా అభివృద్ధి చేసిన రెండు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన నెల్లూరు చేరుకోగా, మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహా పలువురు జిల్లా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చెందిన వీపీఆర్ ఫౌండేషన్ అందించిన రూ. 8.3 కోట్ల ఆర్థిక సహకారంతో సమూలంగా ఆధునికీకరించిన ఆర్.ఎస్.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నూతన భవనాలను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, డైనింగ్ హాల్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

**కార్పొరేట్ హంగులతో ఆర్‌ఎస్‌ఆర్ స్కూల్**

వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో రెండు అంతస్తుల్లో నిర్మించిన ఈ పాఠశాలలో మొత్తం 43 తరగతి గదులను అందుబాటులోకి తెచ్చారు. డిజిటల్ బోధన కోసం ప్రతి గదిలో ఎల్‌ఈడీ స్క్రీన్లు, ఆధునిక బెంచీలు ఏర్పాటు చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ప్రయోగాత్మక, సాంకేతిక విద్య అందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లను సిద్ధం చేశారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్ రూమ్‌లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. చదువుతో పాటు క్రీడలకు కూడా పెద్దపీట వేస్తూ పాఠశాలలో ఎకరం విస్తీర్ణంలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. ఇందులో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టును, అవుట్‌డోర్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం మూలపేట 39వ డివిజన్‌లో రూ. 13.4 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో ఆధునికీకరించిన దేవిరెడ్డి శారద (డీఎస్‌ఆర్) ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను కూడా లోకేశ్ ప్రారంభించారు.

**ఫలితాలపై దృష్టి పెట్టండి: మంత్రి లోకేశ్**

పాఠశాలల ప్రారంభోత్సవం అనంతరం, ఆర్.ఎస్.ఆర్. పాఠశాల పనితీరుపై ప్రధానోపాధ్యాయుడు, ఇతర అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. కేవలం భవనాలు నిర్మిస్తే సరిపోదని, విద్యా ప్రమాణాలు, ఫలితాలు కూడా మెరుగుపడాలని స్పష్టం చేశారు. గతేడాది పదో తరగతిలో కేవలం 60.19 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు, ఎన్‌రోల్‌మెంట్ ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు.. ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?

- మొదటి పేజి తరువాయి

పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

"చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## తిరుమలలో హైటెక్ ఆధ్యాత్మికత.. మ్యూజియం, ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు..

తిరుమలను ప్రపంచస్థాయి పవిత్ర దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ఓ గొప్ప నమూనాగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతికతను ఆధ్యాత్మికతతో సమన్వయం చేస్తూ భక్తులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, బుధవారం తిరుమలలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ. 104 కోట్ల భారీ వ్యయంతో టీసీఎస్ ట్రస్ట్ ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియంతో పాటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన 'పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్'ను ఆయన భక్తులకు అంకితం చేశారు. భక్తులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను తీర్చిదిద్దారు. ఇందులో శ్రీవారికి జరిగే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలతో పాటు తిరుమల క్షేత్రంలోని వివిధ ప్రాంతాలను 3డీ సాంకేతికత ద్వారా కళ్లారా వీక్షించే అవకాశం కల్పించారు. 6డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా శ్రీవారి దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా స్వీకరించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం, ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియాన్ని సీఎం ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీనివాసుని కల్యాణ ఘట్టం వంటి విశేషాలను భక్తులకు సులభంగా అర్థమయ్యేలా ఇందులో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు వంటి మహారాజులు స్వామివారికి సమర్పించిన ఆభరణాల 3డీ నమూనాలు, చారిత్రక వస్తువులు, స్వామివారి కిరీటాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పానోరమిక్ స్క్రీన్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో రూపొందించిన శ్రీవారి పరిణయ వీడియోను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. ఆనాటి సంగీత విద్వాంసులు వాడిన వాయిద్య పరికరాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మరికొన్ని కీలక ప్రకటనలు చేశారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికి ఎల్ఐసీ భాగస్వామ్యంతో ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. దీని ద్వారా తిరుమలలో దురదృష్టవశాత్తూ భక్తుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల నుంచి కూడా ఆలయ నిర్మాణానికి విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. అనంతరం, తిరుమలలో భక్తుల సౌకర్యార్థం రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకు మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, దాతల ప్రతినిధులు సుచిత్రా ఎల్లా, నితిన్ సేత్‌లతో కలిసి ఆయన ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించారు. తిరుమలలో పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే కొండపై 89.5 శాతం పచ్చదనం ఉందని గుర్తుచేశారు. ఆధ్యాత్మికత, పర్యావరణ పరిరక్షణ, సేవ, ఆధునిక సాంకేతికత వంటి ఆరు కీలక అంశాల ప్రాతిపదికన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి వివరించారు.

## ఏపీ తీరం దిశగా అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడేందుకు అనువైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం (సెప్టెంబర్ 19) సాయంత్రం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ అల్పపీడనం రాబోయే 3-4 రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడనుందని అధికారులు తెలిపారు. అనంతరం ఇది దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీని కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ అల్పపీడనం ప్రభావంతో వచ్చే వారంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో, ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు

ప్రజలకు తెలియజేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా గమనించాలని అధికారులు కోరారు.

## సెప్టెంబర్ 17న కేంద్రం, రాష్ట్రం వేర్వేరు పేర్లతో వేడుకలు

హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలకు ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి, సీఏపీఎఫ్ బలగాల పరేడ్‌ను పరిశీలించనున్నారు. గత కొన్నేళ్లుగా సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఈ వేడుకలు నిర్వహిస్తోంది.

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ తదితరులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. 32 జిల్లాల కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామపంచాయతీల్లోనూ జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. ఈ రోజును ఏ పేరుతో నిర్వహించాలన్న దానిపై తెలంగాణలో కొన్నేళ్లుగా రాజకీయ భేదాభిప్రాయాలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022, 2023లో 'జాతీయ సమైక్యతా దినోత్సవం'గా నిర్వహించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024 నుంచి 'ప్రజా పాలన దినోత్సవం'గా నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం 'హైదరాబాద్ విమోచన దినోత్సవం'గా వేడుకలు నిర్వహిస్తోంది.

## వినాయక నిమజ్జనంలో అపశ్రుతి.. చెరువులో పడి ఆరుగురు విద్యార్థులు మృతి

- మొదటి పేజి తరువాయి

అలముకున్నాయి. గ్రామంలోని వినాయక విగ్రహం నిమజ్జనానికి ఊరేగింపుగా వెళ్లిన వారిలో ఆరుగురు ప్రమాదవశాత్తూ నేరేడు చెరువులో పడిపోయారు. వెంటనే స్పందించిన గ్రామస్థులు.. గల్లంతైన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. మృతులను నరసింహ(21), తేజ(17), సిద్దార్థ(17), గణేశ్ (18), సుమంత్‌రెడ్డి (17), ఉదయ్ కిరణ్ (22)గా గుర్తించారు.

**ఘటనపై మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా శిరీష ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతి తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషాద ఘటనలో పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, ఘటనకు సంబంధించిన పరిస్థితులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పిల్లలు, విద్యార్థులు నీటిలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో ప్రమాదకరమైన, లోతైన ప్రాంతాలను గుర్తించి ప్రజలు అక్కడికి వెళ్లకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. గజ ఈతగాళ్లు, రక్షణ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## వివేకా హత్య కేసు నిందితులకు సీబీఐ కోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

కొట్టివేసింది. కేసులో ఏ1 ఎర్ర గంగిరెడ్డి, ఏ3 ఉమాశంకర్ రెడ్డి, ఏ6 గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు డిశ్చార్జ్ పిటిషన్లను సమగ్రంగా విచారించిన కోర్టు, వాటికి ఎలాంటి విచారణార్హత లేదని తేల్చిచెప్పింది. సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్లు, సాంకేతిక ఆధారాలు, సమర్పించిన సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... నిందితులపై ఉన్న అభియోగాలు విచారణకు అర్హమైనవేనని స్పష్టం చేసింది.

## స్థానిక ఎన్నికల కోసం చంద్రబాబు మళ్లీ అవే హామీలు ఇస్తున్నారు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలపై బూటకపు ప్రచారం చేస్తున్నారని వైసీపీ తీవ్రంగా విమర్శించింది. అన్ని రంగాల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ఇప్పుడు ఘనతను దక్కించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరించి మహిళలు, రైతులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారని ఆయన మండిపడ్డారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మళ్లీ అవే హామీలను వల్లె వేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బలహీన వర్గాలకు, మహిళలకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయలేదని శ్రీకాంత్ రెడ్డి ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేసిన తేదీ నుంచి కాకుండా, బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు తమ పింఛన్ల దరఖాస్తుల ఆమోదం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. జగన్ హయాంలో వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్లు అందేవని, చంద్రబాబు ఆ సమర్థవంతమైన వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఏదో ఒక సాకు చూపి లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారని, జగన్ హయాంలో దాదాపు 69 లక్షల మందికి పింఛన్లు అందగా, చంద్రబాబు ప్రభుత్వం సుమారు ఆరు లక్షల మందిని తొలగించిందని ఆరోపించారు. ఇది కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధి లేమిని స్పష్టం చేస్తోందన్నారు. అసైన్డ్ భూములపై చంద్రబాబు చేస్తున్న ప్రచారాన్ని శ్రీకాంత్ రెడ్డి తప్పుదోవ పట్టించే చర్యగా అభివర్ణించారు. పదేళ్లుగా వివాదాస్పద అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న వారికి పట్టా హక్కులు కల్పించే జీవోను జగన్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూములను ఫ్రీహోల్డ్ ఆస్తులుగా మార్చడం ఆ జీవో ఫలితమేనని, కానీ దీనిని తమ ఘనతగా చెప్పుకుంటూ ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ంరాష్ట్రానికి 5 లక్షల ఇళ్లు కేటాయించామని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పడంపై స్పందిస్తూ.. జగన్ ప్రభుత్వం మహిళల పేరు మీద పంపిణీ చేసిన 30 లక్షల ఇళ్ల స్థలాల పట్టాలతో పోలిస్తే ఇది చాలా తక్కువని శ్రీకాంత్ రెడ్డి అన్నారు.

## భార్య ముక్కు కొరికేసిన భర్త... మంచిర్యాలలో దారుణం

తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో ఓ కిరాతక ఘటన వెలుగుచూసింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో ఆగ్రహానికి లోనైన భర్తే, భార్య ముక్కు కొరికి తీవ్రంగా గాయపరిచాడు. ఈ అమానుష ఘటన బుధవారం కొటపల్లి మండలంలో చోటుచేసుకుంది. మణిచందర్, మమత దంపతులకు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరగగా, వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా మమత తన పుట్టింట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో భార్యను తిరిగి తన వెంట తీసుకెళ్లేందుకు మణిచందర్ నేడు అత్తవారింటికి వెళ్లాడు. అయితే మమతను పంపేందుకు ఆమె తండ్రి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కోపోద్రిక్తుడైన మణిచందర్ తన మామపై కర్రతో దాడి చేశాడు. భర్తను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మమతపై కూడా అతను విచక్షణారహితంగా దాడి చేసి, ఆమె ముక్కును కొరికేశాడు. ఈ ఘటనలో బాధితురాలి ముక్కు భాగం తీవ్రంగా దెబ్బతింది. స్థానికులు వెంటనే స్పందించి బాధితురాలికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను వరంగల్‌లోని మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జీరం ఘాటీ నరమేధం కేసులో చారిత్రక తీర్పు.. 10 మంది మావోయిస్టులకు మరణశిక్ష

- మొదటి పేజి తరువాయి

మరణశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2013లో జీరం ఘాటీ అటవీ ప్రాంతంలో సుమారు 150 మందికి పైగా మావోయిస్టులు జరిపిన ఆకస్మిక దాడిలో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అగ్రనాయకత్వం తుడుచుపెట్టుకుపోయింది. ఈ దారుణ నరమేధంలో కేంద్ర మాజీ మంత్రి విద్యాచరణ్ శుక్లా, నాటి పీసీసీ అధ్యక్షుడు నంద్ కుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్ పటేల్, 'సల్వా జుడుం' వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మా సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయారు. దోషులపై భారత శిక్షా స్మృతిలోని హత్య, కుట్ర సెక్షన్లతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద ఎన్ఐఏ కోర్టు ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. భారత రాజకీయ మరియు భద్రతా చరిత్రలో చోటుచేసుకున్న అతిపెద్ద తీవ్రవాద దాడుల్లో ఒకటైన ఈ కేసులో 13 ఏళ్ల తర్వాత బాధితుల కుటుంబాలకు న్యాయం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# కేంద్ర పథకాలకు పెద్దపీట..

**- నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి - ఎంపీ బైరెడ్డి శబరి**




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16**

కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రజలకు సకాలంలో ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని నంద్యాల ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన దిశ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.విద్య, వైద్యం, రహదారులు, నీటి వనరులు, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల ద్వారా అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు.కేంద్ర ప్రాయోజిత పథకాల కింద తొలి త్రైమాసికంలో కేటాయించిన నిధుల్లో 82 శాతం వినియోగించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు. పీఎం-శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు, పీఎం-జన్మన్ కింద రహదారులు, హాస్టళ్లు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.నిధుల విడుదలకు అవసరమైన ప్రతిపాదనలను సకాలంలో సిద్ధం చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించి అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులను కోరారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి। చిత్తూరు। వై.ఎస్.ఆర్. కడప

# నెలబల్లిలో 22A అక్రమ భూ రిజిస్ట్రేషన్ పై అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటి...???

**దొరవారి సత్రం :పెన్ పవర్, సెప్టెంబర్ 16**

రాష్ట్ర ప్రభుత్వం అవసరాల నిమిత్తం 22ఏ నిషేధిత జాబితాలో కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా భద్రపరిచారు. ఆ భూములను నిషేధిత జాబితా సర్వేలో పొందుపరచి


ఎవరికి ఇవ్వడానికి కానీ,భూ పంపిణీలో పంచడానికి కానీ, ఎవరూ ఆక్రమించడానికి కానీ వీలు లేకుండా రెవెన్యూ శాఖ నిషేధిత భూ చట్టం క్రింద ఆ భూములపై ఎవరికీ హక్కు లేకుండా చట్టాన్ని అమలు చేశారు.అయితే ఆ భూములు అన్యాక్రాంతం, ఆక్రమణలకు గురవుతున్నా, సరాసరి భోగస్ సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్న చర్యలు చేపట్టాల్సిన మండల రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రజల ప్రశ్నగా ఉంది. మండల పరిధిలోని నెలబల్లి రెవెన్యూ, సర్వే నంబర్ 7లోని 22ఏ నిషేధిత భూ జాబితాలోని సుమారు 40అంకణాల స్థలాన్ని పంచాయితీకి, మండలానికే సంబంధం లేనిఓ అజ్ఞాత వ్యక్తి వీఆర్వో, సర్వేయర్ ల సహకారంతో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు గ్రామ కంఠం 168-2 నిషేధిత భూమి ఉన్నట్లు తప్పుడు రికార్డులు సృష్టించి సరాసరి నాయుడుపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గత ఏడాది సెప్టెంబర్ మాసంలో రిజిస్ట్రేషన్ జరిగింది. ఆ భూమికి అన్ని హక్కులు కలిగి ఉన్నాయని



రిజిస్ట్రేషన్ పత్రం చూపించి ఆ అజ్ఞాత వ్యక్తి 20 లక్షలకు అమ్మకానికి బే రసారాలు కుదుర్చుకున్నట్లు గ్రామస్తుల ద్వారానే కొంత సమాచారం. నిషేధిత భూములను ఎవరు కొనడానికి.. అమ్మడానికి అధికారం లేకున్నా,సరాసరి ఆ అజ్ఞాత వ్యక్తి సంబంధంలేని బోగస్ సర్వే నంబర్ వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న సంఘటన మండల రెవెన్యూ తాసిల్దార్, సచివాలయ రెవెన్యూ సిబ్బందికి పూర్తి సమాచారం అందిన నేటికీ చర్యలు చేపట్టకపోవడంలోజరుగుతున్న జాప్యం వెనుక మతలబ్ ఏమి జరుగుతుందని ఆ గ్రామ ప్రజలు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ అధికారులు ఏమైనా ఆక్రమణదారులు ఆశ చూపే తాయిలాలకు ఆశిస్తున్నారా, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి సమస్యను గాలికి వదిలేస్తున్నారా అన్న ఆలోచనలు కూడా ఆ గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. అదే గ్రామంలో సర్వేనెంబర్ 7 లో ఉన్న నిషేధిత భూమిలో ఆరుతడి పంటలు వేసుకోవాలి ప్రయత్నించిన నిరుపేద దళితులపై మాత్రం రెవెన్యూ అధికారులు ఆనాడు ఆగమేఘాలపై చర్యలకు ఉపక్రమించి ఆ భూమిలో నిషేధాజ్ఞల బోర్డు ఏర్పాటు చేశారు. నేడు బీసీ సామాజిక వర్గానికి చెందిన అజ్ఞాత వ్యక్తి జాతీయ రహదారికి సమీపంలోనే నిషేధిత జాబితాలోని కొంత భూమిని పక్కా రిజిస్ట్రేషన్ చేసుకున్న స్థానిక రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఎందుకు ఏర్పాటు చేయడం లేదని, ఈ సమస్య ఇలాగే వదిలేస్తే ఉన్న 22ఏ జాబితాలో భూమి కూడా అన్యాక్రాంతం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నట్లు ఆ గ్రామ ప్రజలు అంటున్నారు. సంబంధిత రెవిన్యూ అధికారులు పాలనాపరమైన చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములకురక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# తురిమెర్ల గ్రామంలో విద్యుత్ షాక్ తో ఓ వ్యక్తి మృతి

**సైదాపురం: పెన్ పవర్, సెప్టెంబర్ 16**



సైదాపురం మండల పరిధిలోని తురిమెర్ల గ్రామానికి చెందిన కాకాని. నాగరాజు(37) ఇంటి వద్ద విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటన బుధవారం జరిగినట్లు ఎస్ హెచ్ ఓ క్రాంతి కుమార్ తెలిపారు. బుధవారం రాత్రిసుమారు 12:30 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం సంభవించింది. కాకాని నాగరాజు ఆరు బయట ఫ్యాన్ పెట్టుకుని పడుకున్నాడు. దాహం వేయడంతో ఇంటి లోపలికి వెళ్లి మంచినీళ్లు త్రాగి తలుపు వేస్తున్న సమయంలో మధ్యలో ఉన్న విద్యుత్ వైరు తెగిపోయింది. దానిని సరి చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రవహించి షాక్ గురి కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై సమాచారం. ఆయనకు ప్రమీల అనే మహిళతో వివాహమై ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.కళ్లెదుటే క్షణాల్లోపు నాగరాజు చనిపోవడంతో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ప్రమాద సంఘటనపై ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు వెల్లడించారు.

# పేద విద్యార్థుల చదువుకు 'సిర్డ్స్ఏకం యూఎస్ఏ ' అండ

## - 100 మంది విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ









**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి భాస్కర్ బాబు అన్నారు. ఏకం యూఎస్ఏ ఆర్థిక సహకారంతో సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (సిర్డ్స్) ఆధ్వర్యంలో కొట్టాల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 100 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ భాస్కర్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం వారి చదువుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అందించిన నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి తోడు స్వచ్ఛంద సంస్థలు, దాతలు విద్యార్థుల విద్య కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు.సిర్డ్స్ సంస్థ కార్యదర్శి మారుపూరి హేమశేఖర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యా సామగ్రి విషయంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఏకం యు ఎస్ ఏ సహకారంతో నోటు పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోదండపాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు నోటు పుస్తకాలను అందించడం ఎంతో అభినందనీయమన్నారు. పిల్లలంతా వాటిని సక్రమంగా వినియోగించుకుని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రబాబు, వెంకటనాగులు, సిర్డ్స్ సంస్థ ప్రతినిధులు తేజోవతి, అశ్విని, సుప్రియా తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుక వేలంపాటలో 15 కిలోల లడ్డును సొంతం చేసుకున్న జువ్వలపాటి దంపతులు




**నాయుడుపేట: పెన్ పవర్, 16**

నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురం సుందరం ఫైనాన్స్ వీధిలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో మూడు రోజులు వైభవంగా జరిగాయి. గత నాలుగేళ్లుగా ఆ ప్రాంతంలో ఆనవాయితీగా భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి చవితి వేడుకలను నిర్వహిస్తున్నారు. చింతకాయల సాయి గిరీష్, పాపా రెడ్డి భరత్ లు స్థానికుల సహాయ సహకారాలతో వినాయక చవితి వేడుకను ఏర్పాటు చేస్తున్నారు. మూడవరోజు ఈ వేడుకలో భాగంగా గణేశుని 15 కిలోల లడ్డు వేలం పాటను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లడ్డు చేజి క్కించుకునేందుకు అనేకమంది భక్తులు వేలంపాటలో పాల్గొని పోటీ పడినప్పటికీ నాయుడుపేట బాలాజీ మార్ట్ నిర్వాహకులు, జువ్వలపాటి హస్సేన్ కుమార్, భార్య వరలక్ష్మి దంపతులు పోటీపడి 37 వేల రూపాయలు ఆఖరి వేలం పాటగా దక్కించుకున్నారు. స్వామి వారి ప్రసాదం మాకు దక్కినందుకు ఎంతో సంతోషంగా ఉందని వ్యక్తం చేస్తూ, లడ్డు ప్రసాదాన్ని హాజరైన భక్తులకు పంచి పెట్టారు. ప్రతి ఏటా జరిగే లడ్డు వేలం పాటలో పాల్గొనడమే కాకుండా, ఎంత విలువ పెరిగిన విఘ్నేశ్వరుని ప్రసాదమైన లడ్డును దక్కించుకుంటామని కూడా తెలియజేశారు. వినాయకుని చవితి వేడుకలు ఎటువంటి అవరోధాలు, అనర్థాలు లేకుండా సాఫీగా జరిగిపోయినందుకు, జరిపించిన కార్యనిర్వహకులకు భక్తులందరూ ధన్యవాదాలు తెలిపారు.

# క్యాన్సర్ వ్యాధికి చికిత్స ఉంది

- ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్‌ను ఎదుర్కోవచ్చు
- ప్రగతి సంస్థటాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన, ఆరోగ్య పరీక్షలు

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**



క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించి, వ్యాధి ప్రారంభ దశలో గుర్తించి సకాలంలో చికిత్స పొందేలా అవగాహన కల్పించేందుకు ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ, శ్రీ వెంకటేశ్వర క్యాన్సర్ ఇన్స్టిట్యూట్, టాటా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆధవరం సబ్‌సెంటర్‌లో అవగాహన, ఆరోగ్య పరీక్షల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నోటి క్యాన్సర్‌తో పాటు మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సకాలంలో వైద్యులను సంప్రదించాల్సిన ఆవశ్యకతపై ప్రజలకు వివరించారు. మొత్తం 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.వ్యాధి నివారణలో మొదటి అడుగు ముందస్తుగా వ్యాధి నిర్ధారణ చేసుకోవడమేనని జిల్లా మేనేజర్ హేమంత్ కుమార్ తెలిపారు. అంగన్వాడీ సహాయకుల బ్లడ్ రిపోర్టులు, బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షల ఫలితాలను పరిశీలించి, బీపీ అధికంగా ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు భవిష్యత్తులో బీపీ రాకుండా పాటించాల్సిన ఆరోగ్య నియమాలను వివరించారు. థైరాయిడ్, షుగర్ వంటి సమస్యలను నివారించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, వాటి లక్షణాలపై కూడా అవగాహన కల్పించారు.25 నుంచి 65 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఈ ఆరోగ్య పరీక్షల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి. రమణ సూచించారు.కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్య బాబు, రెడ్డికుమారి, స్టాఫ్ నర్సు మెహతాజ్, మహేంద్ర, కేవీబీ పురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఏపీసీన్ఫ సిబ్బంది, ప్రగతి సంస్థ సిబ్బంది వెంకటేష్, ప్రభాకర్, గుణశేఖర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోట గురుకులం దళిత ఉద్యోగిపై నెల్లూరు డీసీఓ కుట్ర..?

## 'పరిపాలనా అవసరాలు' పేరుతో బదిలీ ఉత్తర్వులు..

## కారణాలు వెల్లడించాలని బాధితుడి విజ్ఞప్తి





**గూడూరు, పెన్ పవర్,సెప్టెంబర్,16:**

నెల్లూరు జిల్లా కోట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఓ చిరుద్యోగికి తాజాగా జారీ చేసిన డిప్యూటేషన్ ఉత్తర్వులు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. సదరు ఉద్యోగి దళిత సామాజిక వర్గానికి చెందినవాడని, తనపై ఇప్పటివరకు ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేవని చెబుతున్నాడు.గతంలో ముత్తుకూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన అనంతరం కోటలోని బాలుర గురుకుల పాఠశాలలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు. తాజాగా ఎలాంటి ముందస్తు కారణం తెలియజేయకుండా మరో గురుకుల పాఠశాలకు డిప్యూటేషన్ ఇవ్వడం తనకు ఆశ్చర్యం కలిగించిందని తెలిపాడు.డిప్యూటేషన్ ఉత్తర్వుల్లో 'పరిపాలనా అవసరాల నిమిత్తం' అని పేర్కొన్నప్పటికీ, ఆ పరిపాలనా అవసరం ఏమిటో స్పష్టంగా తెలియజేయలేదని బాధితుడు అంటున్నాడు. తనపై ఎలాంటి ప్రతికూల నివేదికలు లేదా రిమార్కులు లేని నేపథ్యంలో తనను మాత్రమే ఎందుకు డిప్యూటేషన్‌కు ఎంపిక చేశారో అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నాడు.ఇదిలా ఉండగా, కోటలో గతంలో కొనసాగిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను ను తొలగించి, అక్కడ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసిన విషయం కూడా వివాదానికి దారితీసింది. అప్పట్లో గురుకులంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులను ఇతర ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలలకు తరలించడంపై తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు స్థానికంగా చర్చ జరిగింది.తాజాగా అదే గురుకులంలో విధులు నిర్వహిస్తున్న దళిత చిరుద్యోగికి డిప్యూటేషన్ ఉత్తర్వులు రావడంతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే గతంలో గురుకులం తొలగింపునకు, ప్రస్తుతం జారీ చేసిన డిప్యూటేషన్ ఉత్తర్వులకు ప్రత్యక్ష సంబంధం ఉందా లేదా అన్నది స్పష్టంగా తెలియాల్సి ఉంది.ఉద్యోగిపై ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకపోతే డిప్యూటేషన్ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలు, ఉత్తర్వుల్లో పేర్కొన్న 'పరిపాలనా అవసరాలు' ఏమిటో నెల్లూరు జిల్లా గురుకుల సమన్వయ అధికారి (డీసీఓ) కార్యాలయం స్పష్టం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. ఈ వ్యవహారంపై అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

# వినాయక చవితి మూడో రోజు ఘనంగా అన్నదానం

## - ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నప్రసాద వితరణ

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**



వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శ్రీకాళహస్తి పట్టణంలోని పాత బస్టాండ్ సర్కిల్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు ఆహ్వానం మేరకు డీఎస్పీ నరసింహమూర్తి ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సుమారు 500 మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. వినాయక చవితి సందర్భంగా భక్తులు, ప్రజలకు అన్నప్రసాదం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటారు. కార్యక్రమానికి భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై గోవిందు, సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సురేష్, బాబు, మునిరాజా, సునీల్, దివ్య, శారద, నవభారత యువజన సంఘం నాయకులు గరికపాటి రమేష్, వీ.ఎన్.ఆర్ తదితరులు పాల్గొన్నారు.

## రేపే మెగా రక్తదాన శిబిరం

**– "రక్తదానం చేయండి.. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడండి"**

**– కూటమి నాయకులు, యువత, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: కోలా ఆనంద్**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 8 గంటల నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతీ ఆడిటోరియం (మధు హోటల్)లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దేశ సేవలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువత, కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా నిరంతరం కృషి చేస్తున్నారని కోలా ఆనంద్ పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను ప్రపంచ అగ్రగామి దేశంగా నిలపాలనే సంకల్పానికి ప్రజాసేవ కార్యక్రమాల ద్వారా ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. రక్తదానం.. మహాదానం! అనే సందేశంతో నిర్వహించనున్న ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా

**- భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం, స్వీట్లు, పండ్ల పంపిణీ**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 16:**

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే శ్రీకాళహస్తి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు మంత్రి సత్యకుమార్ పేరుతో సంకల్పం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం రామసేతు వంతెన వద్ద భవన నిర్మాణ కార్మికులకు అల్పాహారం, స్వీట్లు, పండ్లను బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కోలా ఆనంద్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ, మంత్రి సత్యకుమార్ ప్రజారోగ్య రంగంలో మరింత విజయవంతంగా సేవలందించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మంత్రి సత్యకుమార్‌కు కోలా ఆనంద్‌తో పాటు శ్రీకాళహస్తి బీజేపీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమా, జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కోనేటి అయ్యప్ప, ఉపాధ్యక్షులు పుణ్యం ఢిల్లీ కుమార్, కార్యదర్శి కటికం చంద్రశేఖర్, పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఫ్లెక్సీ కృష్ణారెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతి వేడుకలకు ఘన ఏర్పాట్లు




**ప్రత్యేక అభిషేకాలు.. అన్నదానం..**

**సాయంత్రం వైభవంగా చిత్రపట ఊరేగింపు**


**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 16:**

విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలోని పిచాటూరు రోడ్డులో ఉన్న శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీకాళహస్తి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తులు, విశ్వకర్మ సోదరుల కోసం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అదేవిధంగా సాయంత్రం 5 గంటల నుంచి విశ్వకర్మ చిత్రపటాన్ని మేళతాళాలతో మాడవీధుల్లో ఘనంగా ఊరేగించనున్నారు. విశ్వకర్మ సమాజ ఐక్యత, ఆధ్యాత్మికత, సంప్రదాయాలను చాటిచెప్పేలా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని విశ్వకర్మ నాయకులు, సంఘ సభ్యులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమాలను శ్రీకాళహస్తి విశ్వ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు మోహనాచారి, వైస్ ప్రెసిడెంట్ చంద్రాచారి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రూ.90 వేలు పలికిన పిట్టలవారి సందు వినాయకుడి లడ్డూ

**– మూడు రోజుల పాటు ఘనంగా వినాయక చవితి వేడుకలు**

**– భక్తిశ్రద్ధలతో పూజలు.. వైభవంగా నిమజ్జనోత్సవం**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

శ్రీకాళహస్తి పట్టణంలోని పిట్టలవారి సందులో పివిటి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువకులు 12 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత 20 ఏళ్లుగా తమ ప్రాంతంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడో రోజు నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని వినాయకుడి లడ్డూ ప్రసాదానికి వేలం నిర్వహించారు. ఈ వేలంలో స్థానికుడైన దొడ్డారం చిన్న రూ.90 వేల ధరకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు దొడ్డారం చిన్నతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, యువతలో ఐక్యత, భక్తిభావం పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, పివిటి యూత్ యువకులు, భక్తులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# కోట అంబేద్కర్ గురుకులాన్ని పునరుద్ధరించాలి

**గురుకులం ఎత్తివేత పై గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బూదూరు గురవయ్య ఆగ్రహం:**

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,16:**

కోట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలను ఎత్తివేసి, అక్కడ సెంటర్ ఫర్ ఐఐటీ ఎక్సలెన్స్ స్కూల్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గూడూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బూదూరు గురవయ్య గురువారం గురుకుల పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడి, గురుకులం తొలగింపు అనంతరం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కోట గురుకులంలో చదువుతున్న విద్యార్థులను వాకాడు, చిల్లకూరు, నాయుడుపేట తదితర ప్రాంతాల్లోని గురుకుల పాఠశాలలకు తరలించినట్లు తల్లిదండ్రులు గురవయ్య దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఇతర గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా తల్లిదండ్రులు వివరించారు. ఒక్కో గదిలో సుమారు 25 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 50 మందికి పైగా విద్యార్థులను ఉంచుతున్నారని ఆరోపించారు. గదుల్లోనే ట్రంక్ పెట్టెల మధ్య విద్యార్థులు నిద్రించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. అదేవిధంగా తగినన్ని మరుగుదొడ్లు లేకపోవడం, భోజనాలు సమయానికి అందకపోవడం తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

కోటలో ఎంతోకాలంగా కొనసాగుతున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల ద్వారా అనేక మంది దళిత విద్యార్థులు విద్యను అభ్యసించారని తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గురుకులాన్ని యథావిధిగా కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. గురుకులాన్ని తొలగించే ముందు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకోవాల్సి ఉండేదని ప్రశ్నించారు. ఈ సమస్యను ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని తల్లిదండ్రులు ఆరోపించారు. బూదూరు గురవయ్య




మాట్లాడుతూ, విద్యార్థులను వారి సామర్థ్యానికి మించి వసతి గదుల్లో ఉంచడం, మౌలిక వసతుల కొరత, భోజనాల విషయంలో సమస్యలు ఉంటే ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కోటలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలను తిరిగి కొనసాగించి, విద్యార్థులకు స్థానికంగానే మెరుగైన విద్య, వసతి కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# కల్లిపూడి శివారులో నల్లమట్టి దుమ్ము.. తెరవెనక 'ముడుపుల' కథ?

– వ్యర్థాల డంపింగ్‌పై గ్రామస్తుల ఆందోళన అనుమతులపై అనుమానాలు

– బెదిరింపులు, ముడుపుల ఆరోపణలపై సమగ్ర విచారణకు డిమాండ్

**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్ ,సెప్టెంబర్ 16:**

తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ పరిధిలోని కల్లిపూడి గ్రామ శివారులో నల్లమట్టి దుమ్ము, వ్యర్థాల డంపింగ్ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఐరన్ కర్మాగారాల నుంచి వస్తున్నట్లు చెబుతున్న వ్యర్థాలను గ్రామ శివారులో డంపింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యర్థాలను తరలించడం, నిల్వ చేయడం, జల్లెడ పట్టే సమయంలో దుమ్ము భారీగా ఎగిసి సమీప పంట పొలాలు, నివాస ప్రాంతాలను కమ్మేస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పంట పొలాలపై నల్లటి దుమ్ము?**

డంపింగ్ ప్రాంతం నుంచి వెలువడుతున్న దుమ్ము పంట పొలాలపై పడుతుండటంతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే వ్యర్థాల్లోని పదార్థాలు, వాటి వల్ల పర్యావరణం, పంటలపై కలిగే ప్రభావం వంటి అంశాలను అధికారికంగా నమూనాలు సేకరించి పరీక్షించిన తర్వాతే స్పష్టత వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు.

**'ముడుపుల' ఆరోపణలపై విచారణకు డిమాండ్**

వ్యర్థాల వ్యవహారంపై వార్తలు రాయకుండా కొందరు విలేకరులకు డబ్బులు అందుతున్నాయన్న ప్రచారం స్థానికంగా జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు వెలుగులోకి రాలేదు. ఎవరు, ఎవరికి, ఎంత మొత్తంలో, ఏ కారణంతో డబ్బులు ఇచ్చారనే



విషయాలను సమగ్రంగా విచారించి నిజానిజాలు తేల్చాలని పలువురు కోరుతున్నారు.

**ప్రశ్నిస్తే బెదిరింపులా?**

డంపింగ్, కాలుష్యంపై ప్రశ్నించిన కొంతమంది విలేకరులకు బెదిరింపు ధోరణిలో సమాధానాలు వచ్చాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.సి.వి. నాయుడు, ఆయన కుమారుడి పేర్లను కూడా కొందరు ప్రస్తావిస్తున్నప్పటికీ, వారి ప్రత్యక్ష పాత్రను నిర్ధారించే ఆధారాలు ప్రస్తుతం వెల్లడికాలేదు. సంబంధిత వ్యక్తుల వివరణతో పాటు ఆరోపణలపై అధికారిక విచారణ అవసరమని స్థానికులు అంటున్నారు.

**డంపింగ్‌కు అనుమతులు ఉన్నాయా?**

కల్లిపూడి శివారులో వ్యర్థాలను డంపింగ్ చేసేందుకు సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్నాయా? భూమి ఎవరి పేరుపై ఉంది? వ్యర్థాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటి రవాణాకు అనుమతులు ఉన్నాయా? వంటి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారిక అనుమతి పత్రాలు, భూమి వివరాలు, వ్యర్థాల స్వభావం, రవాణా వివరాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**క్వారీలు, ఎర్రమట్టి తవ్వకాలపైనా ఆరోపణలు**

కల్లిపూడి పరిసర ప్రాంతాల్లో క్వారీ బ్లాస్టింగ్, ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వీటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై మైనింగ్, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**సమగ్ర విచారణే పరిష్కారం**

కల్లిపూడి శివారులో పరిస్థితిని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, వ్యర్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. డంపింగ్‌కు సంబంధించిన అనుమతులు, భూమి వినియోగం, రవాణా పత్రాలు, పర్యావరణ నిబంధనల అమలును పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

కాలుష్య ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ముడుపుల ఆరోపణలకు ఆధారాలు ఉంటే వాటిపైనా విచారణ జరపాలని, విలేకరులపై బెదిరింపులు జరిగి ఉంటే వాటిని కూడా పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కల్లిపూడి ప్రజల ప్రధాన డిమాండ్ ఒక్కటే ఆరోపణలు, ప్రచారాలకు అతీతంగా సమగ్ర విచారణ జరిపి అసలు వాస్తవాలను ప్రజల ముందుంచాలి.

# పేటలో ఘనంగా ఆరోగ్యం శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుక





**సూళ్లూరుపేట : పెన్ పవర్, సెప్టెంబర్ 16**

నాడు విద్యార్థి, నేడు బిజెపి పార్టీ నుండి ఎమ్మెల్యేగా ఎన్నికైన అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు, ఆంధ్ర రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు బుధవారం సూళ్లూరుపేటలో కేక్ కోసి పండుగ జరుపుకున్నారు. సి హెచ్ సి ప్రాంగణంలో ఆయన విద్యాభ్యాస సహచర మిత్రులు, స్నేహితుల పుట్టినరోజు వేడుకను నిర్వహించారు.

ఈ సందర్భంగా కేక్ కోసి, రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయనబిజెపిలో జాతీయస్థాయి కార్యదర్శిగా పార్టీలో క్రియాశీలక పాత్ర వహించి,రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఓ మార్క్ సాధించి, మంత్రి స్థాయిలో ఎదిగిన ఒదిగి ఉన్న, పేదల పెన్నిధిగా, ఆపన్న హస్తం అందిస్తూ ఆపద్బాంధవునిగా, జిఎంఆర్ ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ స్థాపించి దాని ద్వారా అనేకమంది ఆయనతో చదివిన విద్యార్థులకు ఇన్సూరెన్స్ అసౌకర్యం కల్పించి, ఆ కుటుంబాల్లో జరిగే కార్యక్రమాలకు తన వంతు సాయం అందిస్తున్న సత్య కుమార్ కు ప్రతిఏటా సూళ్లూరుపేటలో ఆయనకు జన్మదిన వేడుక జరుపుతూనే ఉన్నారు. ఈరోజు కూడా అదే పందా లో మంత్రి సత్య కుమార్ యాదవ్ కు జన్మదిన వేడుకలు ఏర్పాటు చేసి పలు సేవ కార్యక్రమాలు నిర్వహించి, వారి పూర్వ విద్యార్థుల స్నేహానికి నిదర్శనంగా నిలిచారు. రాష్ట్ర ప్రజలకు ఆరోగ్య శాఖ మంత్రిగా విశేష సేవలు అందించాలని, మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని జన్మదిన వేడుకలో భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జి ఎమ్ ఆర్ఓల్డ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చంద్రయ్య, గోపాల్, నారాయణ, చెంచు కృష్ణయ్య, వై.వి కృష్ణయ్య, బ్రహ్మయ్య, రమేష్, వెంకట రమణ, సుబ్రహ్మణ్యం, కృష్ణ లతోపాటు సి హెచ్ సి డాక్టర్స్ స్టీఫెన్ నవీన్, హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# మోదుగులపాలెం ఓసూరమ్మ ఆలయానికి విగ్రహ విరాళం

-రూ. 70 వేల విలువైన అమ్మవారి విగ్రహాన్ని అందించిన డాక్టర్ గంగలపూడి గిరిధర్ రెడ్డి

- ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని గ్రామస్తులు వెల్లడి త్వరలోనే శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు

**ఏర్పేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

ఏర్పేడు మండల పరిధిలోని మోదుగులపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ఓసూరమ్మ దేవత ఆలయానికి భక్తిశ్రద్ధలతో విరాళం అందించారు. చిందేపల్లి శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త డాక్టర్ గంగలపూడి గిరిధర్ రెడ్డి రూ. 70 వేల ఆర్థిక సహాయం అందించి, అమ్మవారి విగ్రహాన్ని తయారు చేయించి ఆలయానికి సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ గంగలపూడి గిరిధర్ రెడ్డిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ఆయన అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, పనులు తుది దశకు చేరుకున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే గ్రామస్తుల సమక్షంలో శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అధిక స్థానాలు సాధించాలి: మాజీ మంత్రి కాకాణి

**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,16:**



ప్రజా పరిపాలన కోసం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మనుబోలులోని పద్మావతి కళ్యాణ మండపంలో సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి సర్వేపల్లి నియోజకవర్గంలో పార్టీకి అధిక స్థానాలు దక్కేలా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై విమర్శలు చేస్తూ, చంద్రబాబు మార్క్ పాలనలో అవినీతి, అక్రమాలు, మోసాలు తప్ప మరేమీ కనిపించడం లేదని ఆరోపించారు. అధికారం కోల్పోయిన తర్వాత చంద్రబాబు నాలుగేళ్లపాటు నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో లేరని విమర్శించారు. జగన్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, వాలంటీర్ వ్యవస్థ, అమ్మ ఒడి వంటి పథకాలను ప్రవేశపెట్టినట్లు కాకాణి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతిపై నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. మట్టి, ఇసుక, బూడిద తదితర అంశాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. మంత్రి నారా లోకేష్‌పై కూడా కాకాణి విమర్శలు చేశారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు అర్జీ సమర్పించేందుకు వెళ్లిన సమయంలో దాన్ని స్వీకరించేందుకు సమయం లేదంటూ వెళ్లిపోయారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి మంత్రిగా కొనసాగేందుకు అర్హత లేదని వ్యాఖ్యానించారు. అనంతరం కాకాణి పూజిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్ పరిపాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. జగన్ 2.0లో కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని, అందులో భాగంగానే కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు కుటుంబ సభ్యుల్లా కలిసి పనిచేసి సర్వేపల్లిలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. బొమ్మిరెడ్డి మధురెడ్డి పర్యవేక్షణలో, మండల శేషయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. పరిశీలకులు వీరి చలపతి, సుధీర్‌రెడ్డి, ఎంపీపీ వజ్రమ్మ, మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ హరిగోపాల్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర విజయభాస్కర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఏలూరు భాస్కర్‌రెడ్డి, కిశోర్‌నాయుడు, ధనుంజయరెడ్డి, గుండాల ఆదినారాయణ, జిప్టి సురేంద్ర, వెంకటసుబ్బయ్య యాదవ్, తులసి యాదవ్, గుంది రమేష్, తుపాకుల గిరి, నాగూర్, రాజేశ్వరమ్మ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా ఆశీర్వాద దీపం వెలిగిద్దాం

## బీజేపీ మండల అధ్యక్షుడు గునుపూడి హరిబాబు




**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,16**

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం 7 గంటలకు ప్రతి ఇంటా ఆశీర్వాద దీపం వెలిగించాలని కోట మండలం బీజేపీ అధ్యక్షుడు గునుపూడి హరిబాబు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాసేవకు కృతజ్ఞతగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఒక దీపం కేవలం వెలుగు మాత్రమే కాదని, అది ఆశ, ఆశీర్వాదం, సంకల్పానికి ప్రతీక అని హరిబాబు పేర్కొన్నారు. ప్రతి ఇంటా దీపం వెలిగించి ప్రధాని నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ 2025 అక్టోబర్ 7న ప్రభుత్వ అధినేతగా సేవల 25వ సంవత్సరంలోకి ప్రవేశించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ప్రజాసేవను కర్తవ్యంగా భావిస్తూ దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం, ప్రజల జీవితాల్లో మార్పు కోసం పనిచేస్తున్న నాయకుడికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేయాల్సిన సందర్భమని హరిబాబు అన్నారు. దేశ నిర్మాణం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఇంటా వెలిగే దీపం ప్రధాని మోదీ పట్ల ప్రజల అభిమానానికి, ఆశీస్సులకు ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. కోట మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రజలను కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచించారు. యువత, మహిళలు, వృద్ధులు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ప్రజాసేవలో కొనసాగుతున్న ప్రయాణానికి ప్రజల కృతజ్ఞతను తెలియజేసే కార్యక్రమంగా ఆశీర్వాద దీపాన్ని నిర్వహిస్తున్నట్లు హరిబాబు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని కోరుకుంటూ వెలిగించే ప్రతి దీపం దేశ భవిష్యత్తుకు వెలుగురేఖ కావాలని ఆయన ఆకాంక్షించారు. కోట మండల ప్రజలు కూడా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

# గర్భిణీలు బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలి

## -ఐసిడిఎస్ సూపర్వైజర్ శివజ్యోతి




**గూడూరు, పెన్ పవర్, సెప్టెంబర్,16:**

గర్భిణీలు, బాలింతలు, పప్పు దినుసులు ,కాయగూరలు లాంటి పోషకాహార పదార్థాలను తీసుకున్నప్పుడు ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్వైజర్ పి శివజ్యోతి పేర్కొన్నారు బుధవారం గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామం పార్టీ మిట్ట అంగన్వాడీ కేంద్రంలో గూడూర్ అర్బన్ ఎస్సీడీఎస్ సూపర్వైజర్ మెహబూబి ఆదేశాల మేరకు పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. అనంతరం పోషకాహార మాసోత్సవాల ర్యాలీని అంగన్వాడి విద్యార్థులు తల్లిదండ్రులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ మాసో త్సవాలలో తల్లులు గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు గీత భారతి సుభాషిని తదితరులు పాల్గొన్నారు

# చందు కుటుంబానికి కొండంత అండగా ఉంటా

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కుటుంబ సభ్యుడు చందుకు ఘన నివాళి
- చిన్న తమ్ముడి బాధ్యత నాదే.. చదువుతో పాటు అన్ని విధాలా అండగా ఉంటానని బొజ్జల సుధీర్ రెడ్డి హామీ






**తొట్టంబేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 16:**

మండలం గుండెలగుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడు చంద్రశేఖర్ (చందు) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. చందు కర్మక్రియల కార్యక్రమానికి టీడీపీ నాయకుడు బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితా రెడ్డి హాజరై చందు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం చందు తల్లి, కుటుంబ సభ్యులను పరామర్శించిన బొజ్జల సుధీర్ రెడ్డి వారికి ధైర్యం చెప్పారు. కన్న కొడుకును కోల్పోయిన తల్లి బాధను అర్థం చేసుకుని, ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు."చందు మన మధ్య లేకపోయినా, ఆయన చిన్న తమ్ముడి బాధ్యత పూర్తిగా నాదే. అతడిని నా సొంత బిడ్డలా చూసుకుంటాను. అతడి చదువుతో పాటు భవిష్యత్తులో అవసరమైన అన్ని విషయాల్లో అండగా ఉంటాను. మీ కుటుంబానికి ఏ ఆపద వచ్చినా, ఏ అవసరం ఉన్నా ఎల్లప్పుడూ ముందుంటాను" అని సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు.చందు కుటుంబాన్ని ఒంటరిగా వదిలిపెట్టబోమని, తెలుగుదేశం పార్టీ కుటుంబం ఎల్లప్పుడూ వారికి అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి దుఃఖంలో తాము కూడా భాగస్వాములమని తెలిపారు.

# గణపతి పప్పా మోరియా నినాదాలతో గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ గణనాథుని నిమజ్జనం వేడుకలు




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16**

జై బోలో గణేష్ మహరాజ్ కి.. గణపతి పప్పా మోరియా అంటూ గణనాథుని నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు ఎన్జీవో కాలనీ శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పూజలు అందుకున్న వినాయకుడు నిమజ్జనానికి తరలి వెళ్లాడు. నిమజ్జనంకి ముందుగా గణనాథునికి శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరి రెడ్డి, డైరెక్టర్లు మౌలాలి రెడ్డి షేక్షావలి రెడ్డి దంపతులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. నిమజ్జనానికి తరలి వెళ్లే కేనాధునికి గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు అడుగడుగున గణనాథునికి నినాదాలు పలుకుతూ నిమజ్జన వేడుకలను నిర్వహించారు. గురు రాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుండి బయలుదేరిన గణనాథుడి శోభాయాత్ర గంటల తరబడి సాగింది. వినాయకుని నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు కేరింతల కొడుతూ ముందుకు సాగారు. అనంతరం వినాయకున్ని నంద్యాల పట్టణ శివారులోని కేసు కెనాల్ లో నిమజ్జన వేడుకలను ముగించారు.

# ఉద్యోగులకు ఇళ్ల భరోసా.. ప్రజలకు వంతెన సౌకర్యం!

- శ్రీకాళహస్తికి కళ్యాణ మండపం మంజూరు చేయాలి
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు ఐ ఏ ఎస్ కు చైర్మన్ సాయి కొట్టే ప్రసాద్ వినతి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, సెప్టెంబర్ 16:**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానాన్ని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కన్నబాబు ఐ ఏ ఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ సాయి కొట్టే ప్రసాద్, కార్యనిర్వహణ అధికారి బి.కె. వెంకటేశులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.






**ఆలయ అభివృద్ధిపై సమీక్ష**

దర్శనం అనంతరం ఆలయ అధికారులు, సిబ్బందితో సమావేశమైన కన్నబాబు ఆలయ పరిపాలన, భక్తులకు అందుతున్న సౌకర్యాలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ సాయి కొట్టే ప్రసాద్ శ్రీకాళహస్తి క్షేత్ర అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం, ప్రజల మౌలిక సదుపాయాలకు సంబంధించిన పలు అంశాలను ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు.

**ఉద్యోగులకు వసతి సౌకర్యం కల్పించాలి**

దేవస్థానంలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తెలుగు గంగ సమీపంలోని ఇళ్లను ఆలయ ఉద్యోగుల వసతి అవసరాలకు అనుగుణంగా కేటాయించే అంశాన్ని పరిశీలించాలని చైర్మన్ కోరారు. ఉద్యోగులకు వసతి సౌకర్యం అందుబాటులోకి వస్తే విధుల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని వివరించారు.

**గొడ్డేరు వంతెన పనులు వేగవంతం చేయాలి**

శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా, ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపేలా గొడ్డేరు సమీపంలో చేపట్టిన వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వంతెన అందుబాటులోకి వస్తే ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా కొంతవరకు పరిష్కారమవుతాయని తెలిపారు.

**ప్రజల కోసం కళ్యాణ మండపం మంజూరు చేయాలి**

శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలు, భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కళ్యాణ మండపం మంజూరు చేయాలని కన్నబాబును చైర్మన్ సాయి కొట్టే ప్రసాద్ కోరారు. స్థానిక ప్రజలు, భక్తులు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఆలయ సేవతో పాటు ఉద్యోగుల సంక్షేమం, భక్తుల సౌకర్యాలు, ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చైర్మన్ పేర్కొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరస్వామివారి క్షేత్ర అభివృద్ధి మరింత వేగంగా సాగడంతో పాటు భక్తులు, ఉద్యోగులు, స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని భక్తులు ఆకాంక్షించారు.

# అభివృద్ధి చేసే ఎమ్మెల్యే పై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదు

## " టిడిపి ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం "

**సూళ్లూరుపేట: పెన్ పవర్, సెప్టెంబర్ 16**

కూటమి ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యేగా నెలవల విజయశ్రీ ఎన్నికైన నాటినుండి నేటి వరకు 26 నెలల్లో250 కోట్ల అభివృద్ధి జరిగి ఉంటే, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పని కట్టుకొని చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవేనని పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం తీవ్రంగా ఖండించారు. సులూరుపేట పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రోడ్లపై పిడికెడు మట్టి కూడా వేయని మీరు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, ప్రశ్నించే అర్హత కూడా మీకు లేదని అన్నారు. రోడ్డు లేని చిగురుపాడు గ్రామానికి 1.90 లక్షల నిధులను కేటాయించడంతోపాటు,



గ్రామ ప్రాంతాల్లో సిసి రోడ్లు నీకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి విషయంలో ఎవరు సలహా ఇచ్చినా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అనవసరమైన అపోహలతో కూడిన, నిరాధారమైన ఆరోపణలు, అభియోగాల వంటివి చేయడం విరమించుకోవాలని హెచ్చరించారు. అభివృద్ధి అజెండాగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ కి గ్రామాల్లో బ్రహ్మరథం పడుతున్నారని, గుర్తు చేశారు. విమర్శించేముందు నీవు గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమిటి, నేడు జరుగుతున్న అభివృద్ధి ఏమిటని బేరీజు వేసుకొనిఆత్మ పరిశీలనతో ఆచితూచి మాట్లాడాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

# పసుపుమయమైన కోవూరు.. కంచుకోటలో కదం తొక్కిన కార్యకర్తలు

## - భారీ ర్యాలీగా తరలివెళ్లి ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన నారా లోకేష్

- అనంతరం కేడర్ మీటింగ్‌లో పాల్గొని పార్టీ బలోపేతం, కార్యకర్తల సంక్షేమంపై దిశానిర్దేశం చేసిన యువ నేత
- దశాబ్దాలుగా పసుపు జెండాను మోస్తున్న కార్యకర్తలే కోవూరు టీడీపీకి కొండంత బలం: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సీనియర్లు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలి: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**కోవూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16.**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు కాంస్య విగ్రహావిష్కరణ, కేడర్ మీటింగ్‌లో పాల్గొనేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం కోవూరులో పర్యటించారు. నెల్లూరు నుంచి కోవూరు చేరుకున్న మంత్రి లోకేష్ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి యువ నాయకులు, డా.అర్జున్ రెడ్డితో కలిసి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం అభిమానులు, కార్యకర్తల భారీ జనసందోహం నడుమ దారిపొడవునా ర్యాలీగా తరలివెళ్లి, ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కేడర్ మీటింగ్‌లో పాల్గొన్నారు.




**స్థానిక ఎన్నికల్లో 100% విజయమే లక్ష్యం: ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి**

కేడర్ మీటింగులో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, నిర్ణీత సమయానికి కోవూరు కేడర్ మీటింగ్ ప్రారంభం కావాలనే ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ నెల్లూరులో జరుగుతున్న బైక్ ర్యాలీని మధ్యలోనే ఆపేసి రావడం ఆయన సమయపాలనకు, క్రమశిక్షణకు నిదర్శనమని అన్నారు. కార్యకర్తలందరూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. విజయవాడలో జరిగిన లీడర్‌షిప్ కాన్క్లేవ్ ద్వారా కార్యకర్తల సంక్షేమం, పార్టీ బలోపేతంపై ఎన్నో విషయాలు నేర్చుకున్నామని, ఇలాంటి సమావేశాలు మూడు నెలలకోసారి నిర్వహిస్తే తమలాంటి కొత్త నాయకులకు ఎంతో ఉపయోగపడతుందని తెలిపారు. 11 సార్లు ఎన్నికలు జరిగితే 8 సార్లు విజయం సాధించిన కోవూరు గడ్డపై సీనియర్లు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**కార్యకర్తే అధినేత అని చూపిస్తున్నాం: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, 1980ల నాటి నుంచి పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా పసుపు జెండాను మోస్తున్న నిబద్ధత కలిగిన కార్యకర్తలే కోవూరులో టీడీపీకి బలమని కొనియాడారు. వారసత్వం అంటే కేవలం ఆస్తులు కాదని, తాతలు, తండ్రుల ఆశయాలను నిలబెట్టడమని లోకేష్ నిరూపించారని తెలిపారు. రూ.100 కే ఇన్సూరెన్స్, న్యూట్రిపుల్, గ్రీవెన్స్ వంటి సేవలతో పాటు ఎన్టీఆర్ మోడల్ స్కూల్స్, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, బసవతారకం ఆస్పత్రి ద్వారా వేలాది మందికి సేవలు అందిస్తున్నారని వివరించారు. ఐటీ మంత్రిగా విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌తో పాటు పలు ప్రముఖ ఐటీ కంపెనీలను తీసుకురావడం ఆయన సమర్థతకు నిదర్శనమన్నారు. గత పాలకులు ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద నిలబెట్టి అవమానిస్తే, విద్యాశాఖ మంత్రిగా లోకేష్ మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేస్తూ ఉపాధ్యాయ వ్యవస్థను బలోపేతం చేశారని గుర్తుచేశారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీలపై కనీస అవగాహన లేని ప్రతిపక్షాలు మెగా డీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శ్రీ బీద రవిచంద్ర జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూఖ్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ క్లీన్ స్వీప్ చేయాలి: ఎన్ఎండీ ఫిరోజ్

- సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు టీడీపీ మరియు కూటమి పరం కావాలి
- నంద్యాల టీడీపీ కార్యాలయంలో నంద్యాల మండల క్లస్టర్, బూత్, యూనిట్ స్థాయి సమీక్ష

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేయాలని, గ్రామీణ స్థాయిలో అన్ని స్థానాలనూ కైవసం చేసుకోవడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా శ్రమించాలని నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పిలుపునిచ్చారు.నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నంద్యాల మండలానికి చెందిన క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌ల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్యఅతిథిగా హాజరై మండల పరిధిలోని పంచాయతీలు, గ్రామాల వారీగా పార్టీ బలోపేతంపై సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి శ్రేణులకు పలు సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వార్డు మెంబర్లు సహా అన్ని స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీ మరియు కూటమి బలపరిచిన అభ్యర్థులే గెలుపొందేలా బూత్ స్థాయి నుంచే వ్యూహాత్మకంగా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ వివరించాలని సూచించారు. నిరంతరం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి సమన్వయమే పార్టీ విజయానికి పునాది అని తెలిపారు . కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి గ్రామస్థాయిలో టీడీపీ మరియు కూటమి కి ఏకపక్ష మెజారిటీ సాధించి పెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో నంద్యాల మండల పరిధిలోని క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, బూత్ కన్వీనర్లు, యూనిట్ బాధ్యులు, మండల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేటి నుంచి నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్

## రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు

**గంగవరం రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 16:**
వికసిత్ భారత్2047 లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమన్వయంతో 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు అన్ని జిల్లాల్లో వివిధ ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

ఈ కార్యక్రమాల్లో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యా సంస్థలు, ప్రజలను భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం సూచించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడంతో పాటు కార్యక్రమాలకు సంబంధించిన చిత్రాలు, దృశ్యాలను సేకరించి అధికారిక సమాచార మార్గాలు, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించనున్నారు.

ప్రధాన కార్యక్రమాలు

<u>ఆశీర్వాద్ కా దియా:</u>
సెప్టెంబర్ 17న సాయంత్రం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల కుటుంబాలతో వారి ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

'డ్రీమ్స్ ఆఫ్ ఇండియా' విద్యార్థుల ప్రతిభకు వేదిక:
పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యార్థులకు చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహించనున్నారు. ప్రధాని సేవా రికార్డు, అభివృద్ధి చెందిన భారత్ అంశాలపై ఈ పోటీలు జరగనున్నాయి. విజేతలకు ముఖ్యమంత్రి సంతకం చేసిన ధ్రువపత్రాలను అందజేయనున్నారు.

<u>నమో సేవా గాథ:</u>
ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరిస్తూ 25 నుంచి 30 నిమిషాల నిడివి గల సంగీత, వీధి నాటకాలను పాఠశాలలు, కళాశాలలు, ప్రజా ప్రదేశాల్లో ప్రదర్శించనున్నారు.

<u>ఆంగన్ కా ఉత్సవ్:</u>
సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 7 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సన్మానించడంతో పాటు పోషకాహారం, సంక్షేమ పథకాలపై తల్లులు, పిల్లలకు అవగాహన కల్పించనున్నారు.

<u>సేవా మేరా యోగదాన్:</u>
సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు పౌరులు తమకు నచ్చిన సేవా కార్యక్రమాన్ని ఎంచుకుని కనీసం 25 నిమిషాల పాటు సేవ చేయవచ్చు. కార్యక్రమానికి సంబంధించిన ఆధారాలను 'మై భారత్' పోర్టల్‌లో నమోదు చేసుకుని డిజిటల్ ధ్రువపత్రం పొందే అవకాశం కల్పించనున్నారు. అక్టోబర్ 2న రాష్ట్రవ్యాప్తంగా ఒక లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

<u>సేవా సేతు అభియాన్:</u>
ప్రతి శాసనసభ నియోజకవర్గంలోని మండల స్థాయిలో 'సేవా సేతు' శిబిరాలను నిర్వహించి, అర్హులైన ప్రజలకు వివిధ ప్రభుత్వ పథకాలను ఒకే వేదిక ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నారు.

<u>కహానీ బదలావ్ కీ:</u>
ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల విజయగాథలను సేకరించి, ఎంపిక చేసిన కథనాలను దృశ్య రూపంలో రూపొందించి ప్రజలకు చేరువ చేయనున్నారు.

<u>వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర:</u>
దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన అభివృద్ధి ప్రదేశాలను డిజిటల్ కంటెంట్ సృష్టికర్తలు, ప్రభావశీలుల ద్వారా సందర్శింపజేసి అక్కడి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు పరిచయం చేయనున్నారు.

<u>రాష్ట్రవ్యాప్తంగా నూతన ఆవిష్కరణల సవాల్:</u>
యువత, నూతన సంస్థలు, నూతన ఆలోచనలతో ముందుకు వచ్చే వారిని భాగస్వామ్యం చేస్తూ వినూత్న ఆలోచనలను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల అమలులో సంబంధిత శాఖల అధికారులు సమన్వయకర్తలుగా వ్యవహరించనున్నారు. కార్యక్రమాల ప్రణాళిక, సమన్వయం, అమలు, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సేవా సంకల్ప్ అభియాన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

# నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ జరుగుచున్న వినాయక నిమజ్జన కార్యక్రమాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీస్



– ఐకమత్యంతో, సోదరభావంతో, సంతోషకర వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలి.....

<u>నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16</u>
నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యలూరిమెట్ట మరియు కొత్తపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న వినాయక నిమజ్జన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీస్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నిమజ్జన కార్యక్రమానికి హాజరైన ప్రజలతో మాట్లాడి, అందరూ ఐకమత్యంతో, సోదరభావంతో, సంతోషకర వాతావరణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు.అనంతరం నిమజ్జన కార్యక్రమాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు మరియు సిబ్బందితో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.ప్రజల సహకారంతో వినాయక నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టింది.

# బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు

– గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి
ఎఫ్ఆర్‌టీఐ జాతీయ సహాయ కార్యదర్శి కుప్పాల అజయ్ ప్రసన్న కుమార్

**తిరుపతి, పెన్ పవర్ ,సెప్టెంబర్ 16:**
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఫోరం ఫర్ ఆర్‌టీఐ (ఎఫ్ఆర్‌టీఐ) జాతీయ సహాయ కార్యదర్శి, శ్రీవారి భక్తుడు కుప్పాల అజయ్ ప్రసన్న కుమార్ కోరారు.గతంలో చోటుచేసుకున్న బాధాకర ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తకుండా అధికారులు ముందస్తు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
తిరుపతి జిల్లా పోలీసు శాఖతో పాటు టీటీడీ, తిరుపతితిరుమల పరిధిలోని అన్ని సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కోరారు.

<u>సామాన్య భక్తులకు ప్రాధాన్యత</u>
బ్రహ్మోత్సవాల సందర్భంగా సామాన్య భక్తులకు ప్రాధాన్యత కల్పించేలా ఏర్పాట్లు ఉండాలని అజయ్ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.
భక్తుల రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, క్యూలైన్లు, పార్కింగ్, వసతి, తాగునీరు, వైద్య సేవలు తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు.
శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే విశేష పూజలు, ఉత్సవ కార్యక్రమాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. భక్తులందరితో అధికారులు, సిబ్బంది సంయమనంతో, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.
తిరుమలతిరుపతి స్థానిక భక్తులతో పాటు ఆంధ్రప్రదేశ్, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, విదేశాల్లోని శ్రీవారి భక్తులు, యాత్రికులందరిపై శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని అజయ్ ప్రసన్న కుమార్ ఆకాంక్షించారు.

# వినాయకుడి లడ్డూ వేలంలో సయ్యద్ కరీముల్లా హవా

– భక్తిశ్రద్ధలతో వేలం పాటలో పాల్గొని లడ్డూను దక్కించుకున్న మాజీ సర్పంచ్
– గ్రామ ఐక్యతకు ప్రతీకగా వినాయకుడి లడ్డూ వేలం లడ్డూను ప్రసాదంగా గ్రామస్థులకు పంపిణీ చేసిన సయ్యద్ కరీముల్లా

**ఏర్పేడు, పెన్ పవర్ ,సెప్టెంబర్ 16:**



ఏర్పేడు మండలం మాధవమాల గ్రామపంచాయతీలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీరాముల మందిరం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహం వద్ద గ్రామ ప్రజలు, పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన వినాయకుడి లడ్డూ వేలం పాట ఉత్సాహభరితంగా సాగింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు సయ్యద్ కరీముల్లా భక్తిశ్రద్ధలతో వేలం పాటలో పాల్గొని లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలు, మహిళలు, యువత ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.లడ్డూను వ్యక్తిగతంగా ఉంచుకోకుండా వినాయకుడి ప్రసాదంగా గ్రామస్థులకు పంచిపెట్టి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా సయ్యద్ కరీముల్లా మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. వినాయకుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువతతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# రోడ్డు ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దిగ్భ్రాంతి



**ఆత్మకూరు పెన్ పవర్ సెప్టెంబర్ 16**
నంద్యాల జిల్లా ఆత్మకూరు వినాయక నిమజ్జనం సందర్భంగా ఎర్రగూడూరు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై రెండు బైక్‌లు ఢీకొని ఆరుగురు తీవ్రంగా గాయపడటంపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# నంద్యాల మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే మన ఏకైక లక్ష్యం ఎన్ఎండీ ఫిరోజ్

**– పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను కౌన్సిలర్లుగా గెలిపించే బాధ్యత మాది**
**– ఫరూక్ కొడుకులు ఎన్నడూ తప్పుడు పనులు చేయరు : ఎన్ఎండీ ఫిరోజ్**
**– అబద్ధపు ప్రచారాలు, ఫేక్ వార్తలను నంద్యాల ప్రజలు నమ్మరు**
**– ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరించే వారికే ఓట్లు సినిమా డైలాగులు పనిచేయవు**
**– నంద్యాల టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, బూత్, వార్డు ఇన్‌ఛార్జ్‌ల సన్నాహక సమావేశం**






**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16:**
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నంద్యాల మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకోవడమే తెలుగుదేశం పార్టీ ఏకైక లక్ష్యమని నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ తెలిపారు . నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మునియార్ ఖలీల్ అధ్యక్షతన నిర్వహించిన నంద్యాల టౌన్ క్లస్టర్, బూత్, వార్డు ఇన్‌ఛార్జ్‌లతో ఆయన విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాబోయే కౌన్సిలర్లను, నాయకులను, మహిళా ప్రతినిధులను ఉద్దేశించి ఆయన దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ మరో నెల రోజుల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, మనమంతా అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 20 సంవత్సరాల తర్వాత నంద్యాల మున్సిపల్ పీఠంపై టీడీపీ జెండా ఎగరేయడమే మన లక్ష్యమన్నారు. గత రెండేళ్లుగా రాత్రింబవళ్లు పార్టీ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలను కౌన్సిలర్లుగా గెలిపించుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు.గత కొద్ది రోజులుగా తమపై కొందరు కుట్రపూరితంగా ఫేక్ వార్తలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. "ఫరూక్ కుటుంబం, ఆయన కొడుకులు ఎన్నడూ తప్పుడు పనులు చేయరు, తప్పు చేసేవారిని ప్రోత్సహించరు అని తేల్చి చెప్పారు. ఎవరి ఆస్తులను లాక్కోలేదు, ఎవరిపైనా అక్రమ కేసులు పెట్టలేదు" అని ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్ని అసత్యాలు రాసినా, ప్రచారం చేసినా ప్రజాక్షేత్రంలో ప్రజలే సమాధానం చెబుతారని అన్నారు .వైసీపీ నేతలు నియోజకవర్గంలో ఎప్పుడూ అందుబాటులో ఉండరని, ఎన్నికల ముందు మాత్రమే వచ్చి రెండు మాటలు మాట్లాడి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. తాము మాత్రం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల పిలుపునకు అర్ధరాత్రయినా స్పందిస్తున్నామని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు పెన్షన్లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందిస్తున్నామని తెలిపారు . పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల పనులను శరవేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు."ఇది సినిమా కాదు... డైలాగులు చెప్పి, మీసాలు తిప్పితే ఇక్కడ ఓట్లు పడవు. ప్రజల్లో ఉండి పని చేసి చూపిస్తేనే ఓట్లు వేస్తారు అని అన్నారు . పులులు, సింహాలు లాంటి మాటల డ్రామాలు కట్టిపెట్టి ప్రజా సేవ చేయాలి" అని హితవు పలికారు.టీడీపీ నాయకులు , కార్యకర్తలు వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లాలని, అవసరమైతే వందసార్లైనా ప్రతి గడప తొక్కి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, అందించిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల వేళ ఉదయం 5 గంటలైనా, రాత్రి 10 గంటలైనా వార్డుల్లో ఉండేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ప్రతి ఒక్కరూ వ్యూహాత్మకంగా ముందుకు సాగి నంద్యాలలో తిరుగులేని విజయం సాధించాలని కోరారు.
ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ వార్డు, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అతి త్వరలోనే సొంత పార్టీ కార్యాచరణ.. ప్రకటించ బోతున్న గోళ్ళ రాజేష్..

**– నా పార్టీ.. నా జెండా..నా అజెండా ..నా నియోజక వర్గం..నా ప్రజల సంక్షేమం..ప్రతి పేద కుటుంబ ఆర్థిక అభివృద్ధే.. నా ధ్యేయం..నా లక్ష్యం.. గోళ్ళ రాజేష్.**
**– ధనం కాదు నంద్యాల నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, యువతకు ఉపాధి..విద్యా..వైద్యం..వారి శ్రేయస్సే నా ప్రధాన లక్ష్యం..అదే నా ధ్యేయం..**




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16**
నంద్యాల నియోజకవర్గ ప్రజలందరికీ సుపరిచితుడు,సేవా నిరతులు అందరికీ ఆత్మీయులు పేద,బడుగు, బలహీన వర్గాలకు పేదల పెన్నిధీ ధనం కాదు నా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి,వారి శ్రేయస్సే నాకు ముఖ్యం అని ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని దృఢ నిశ్చయంతో ముందుకు వెలుతున్న నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త గోళ్ళ రాజేష్ ప్రజలందరికీ సుపరిచితుడు .ఇప్పటికే ఎన్నో సేవా,సహాయ సహకారాలు,ఆర్థిక సహకారాలతో పాటు ప్రతి ఒక్కరి పేద,మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో సంక్షేమ పథకాలు కౌలు రైతులు , నిరుద్యోగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు,ప్రతి రోజు నిత్యం కేవలం ఒక్క రూపాయికే 1600 వందల మందికి రుచికరమైన భోజనం అందిస్తు ఆకలిని తీరుస్తూ సామాజిక కార్యక్రమాలకు ఆర్థిక సహాయం చేస్తూ, దేవాలయాలు,మసీదులు,చర్చీల,వాటి నిర్మాణం అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు 70 లక్షలకు పైగా ఆర్థిక సహకారం అందించారు గోళ్ళ రాజేష్ హిందూ స్మశాన వాటిక వైకుంఠ రథం కొరకు 10 లక్షల రూపాయలు అందించారు.అనాథ శవాల ఖననం కొరకు తన సొంత ఖర్చులతో సహాయం చేస్తు, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం శ్రమిస్తూ సమాజ అభివృద్ధిలో పాటు పడుతున్న అర్హులైన జర్నలిస్టులకు ప్రతి రెండు నెలలకు 3000 వేల రూపాయల ఆర్థిక సహకారం, చిరు వ్యాపారులకు లక్షలాది రూపాయలు వడ్డీ లేని రుణాలను అందిస్తూ సమాజ హితం కొరకు ఎన్నో సంక్షేమ పథకాలు తమ సొంత నిధులతో కోట్లాధి రూపాయలు ఖర్చు చేస్తున్నారు గోళ్ళ రాజేష్ అమలు చేస్తూ భవిష్యత్తులో మరింత ఎన్నోరకాల నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు రూపొందించుకుంటూ నంద్యాల నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ కుల,మత భేదం భావాలు లేకుండా మంచి హృదయంతో సేవా తత్పరత భావంతో ప్రజలందరితో మమేకమవుతూ ప్రజలందరి ప్రేమాభిమానాలు వారందరి సహకారాలను,వారి ఆశిస్సులను పొందుతున్నారు గోళ్ళ రాజేష్.అతి త్వరలోనే తన సొంత పార్టీ,జెండా,తన అజెండా పార్టీ విధి విధానాలు, నియమ,నిబంధనలు తమ పార్టీ సిద్దాంతాలు పార్టీ కార్యాచరణ రూపొందించి ప్రజల ముందరకు అతి త్వరలోనే ప్రవేశ పెట్టబోతున్నారు నూతన పార్టీనీ ఆవీర్భవించ నున్నారు మన నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త,సామాజికవేత్త గోళ్ళ రాజేష్

# కౌశలం ద్వారా ఉద్యోగ అవకాశాలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16**
నిరుద్యోగ యువతకు నైపుణ్యానికి అనుగుణంగా ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 17న నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు.ఉదయం 10 గంటలకు జరిగే ఉద్యోగ మేళాలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థలో ఉత్పత్తి సహాయకుల ఉద్యోగాలకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమా, పారిశ్రామిక శిక్షణ సంస్థ విద్యార్హతలు కలిగి, 19 నుంచి 32 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు హాజరు కావచ్చన్నారు.అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్, దరఖాస్తు పత్రం, ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా కౌశలం వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఆళ్లగడ్డ మండల రెవెన్యూ సహాయకుల సమస్యలకు కాంగ్రెస్ పార్టీ అండ



**ఆళ్లగడ్డ పెన్ పవర్ సెప్టెంబర్ 16**
ఆళ్లగడ్డ మండల రెవెన్యూ సహాయకులు (తలారీలు) తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి కాంగ్రెస్ పార్టీ తరఫున బరగోడ్ల హుస్సేన్ బాషా , కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్, ఆళ్లగడ్డ మద్దతు ప్రకటించారు.తలారీలు గ్రామస్థాయిలో ప్రజలకు, రెవెన్యూ శాఖకు మధ్య వారధిగా పనిచేస్తూ కీలకమైన సేవలు అందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని కోరారు.తలారీలు ముందుకు తెచ్చిన పేస్కేల్, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు, విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేయడం వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించాలని ఆయన కోరారు."ఆళ్లగడ్డ మండల రెవెన్యూ సహాయకులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ తరఫున మా పూర్తి మద్దతు ఉంటుంది. వారి సమస్యల పరిష్కారం కోసం వారికి ఎల్లప్పుడూ అండగా నిలబడతాం. వారి గొంతును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మా వంతు కృషి చేస్తాం." అని బరగోడ్ల హుస్సేన్ బాషా హామీ ఇచ్చారు హామీ ఇచ్చారు.అనంతరం ఆళ్లగడ్డ ఎంపీడీవో ఆఫీస్ లో ఆల్ పొలిటికల్ పార్టీ మీటింగ్లో పాల్గొనడం జరిగింది

# నంద్యాల మండలంలో ఎంపీటీసీ & జడ్పీటీసీ ఎన్నికల ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై రాజకీయ పార్టీలతో చర్చ

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16**



రానున్న ఎంపీటీసీ & జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నంద్యాల మండలంలో ప్రతిపాదించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్లపై నంద్యాల ఎంపీడీఓ కార్యాలయంలో ఈరోజు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో నంద్యాల ఎంపీడీఓ సుగుణశ్రీ ముసాయిదా పోలింగ్ స్టేషన్ల వివరాలను తెలియజేస్తూ, పోలింగ్ కేంద్రాల విషయంలో ఏవైనా మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు.ఈ సమావేశంలో జనసేన పార్టీ నంద్యాల నియోజకవర్గ నాయకులు రాచమడుగు చందు, దొడ్ల సురేష్ చౌదరి, రాచమడుగు రాంబాబు పాల్గొని, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సౌకర్యవంతంగా మరియు పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగేందుకు అవసరమైన సూచనలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

# చిరు వ్యాపారులకు రుణ సాయం,,

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ సెప్టెంబర్ 16**




నంద్యాల పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో బుధవారం సూనెపల్లె యూనియన్ బ్యాంకు శాఖలో లోక కళ్యాణ మేళా ద్వారా పీఎం స్వనిధి రుణాల కోసం ప్రత్యేక శిబిరం నిర్వహించారు.
ఈ సందర్భంగా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పీఎం స్వనిధి పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వీధి విక్రయదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.యూనియన్ బ్యాంకు మేనేజర్ సురేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేల వరకు రుణాలు అందిస్తామని తెలిపారు. సకాలంలో వాయిదాలు చెల్లించే వారికి రాయితీలు, రూపే కార్డు ద్వారా వడ్డీ రహిత పరిమితి వంటి ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు వివరించారు.కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ అధికారి శివరెడ్డి, మెప్మా సీఓ చంద్ర విద్యాసాగర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మంత్రి పదవుల కోసం మతం మార్చుకున్నారు!! - విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** విపక్షం వైసీపీని లక్ష్యంగా చేసుకుని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి చేస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. కొత్త రాజకీయ పార్టీ పెడతానని కొన్నిరోజులుగా చెబుతున్న విజయసాయిరెడ్డి సమయం, సందర్భం లేకుండా విపక్షంపై ఘాటు విమర్శలతో విరుచుకుపడుతుండటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. కొత్త పార్టీ ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై మత మార్పిడి ఆరోపణలు చేసిన విజయసాయిరెడ్డి తాజాగా రెండేళ్ల క్రితం నాటి ఒక వీడియోను షేర్ చేశారు. వైసీపీలో ఎమ్మెల్యే, మంత్రి పదవులు పొందాలంటే జగన్ ను ఆకట్టుకునేందుకు మతం మార్చుకోవాల్సివచ్చేదని ఆరోపించడమే కాకుండా, ఇలా ఎంతోమంది మార్చుకున్నారో వైసీపీలో నెంబర్ వన్ చెప్పాలంటూ పోస్టు పెట్టారు.రెండేళ్ల క్రితం ఏపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారపురెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్రసంగించిన వీడియోను విజయసాయిరెడ్డి తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. "వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మాజీ, సీనియర్ ఎమ్మెల్యే 2024 ఎన్నికల ముందు చేసిన ఈ ప్రసంగంపై రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ అభిప్రాయం తెలియజేయాలి" అంటూ కోరారు. అంతేకాకుండా "గతంలో ఎంతమంది నాయకులు తమ ఎమ్మెల్యే టికెట్ల కోసం, ఆ తర్వాత ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం జగన్ గారిని ఆకట్టుకునేందుకు మతం మార్చుకున్నారో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌లో నంబర్ వన్ సమాధానం చెప్పాలని కోరుతున్నా." అంటూ రాశారు.





ఉన్నట్టుండి విజయసాయిరెడ్డి చేసిన ఈ పోస్టు రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. సహజంగా రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలకు తగిన సమయం సందర్భం ఉంటుందని, కానీ ఇప్పుడు ఎలాంటి చర్చ లేని మత మార్పిడుల అంశాన్ని విజయసాయిరెడ్డి తెరపైకి తేవడం వెనుక ఆయన ఉద్దేశం ఏమైవుంటుందో అర్థం కావడం లేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ పార్టీ పెట్టాలని భావిస్తున్న విజయసాయిరెడ్డి విపక్షంలో ఉన్న వైసీపీ స్థానంలో ఎదగాలని భావించడంలో తప్పు లేదని, కానీ ఎప్పటిదో వీడియోను బయటకు తీసి ఇప్పుడు వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయం చెప్పాలంటూ నిలదీయడమే ఆశ్చర్యంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.వైసీపీలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపణలు చేస్తున్న విజయసాయిరెడ్డి ఆ పార్టీని అధినేత జగన్మోహనరెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలనే వ్యూహంతో ఇటువంటి పోస్టులు చేస్తున్నారని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. పాత వీడియోలు బయటకు తీసి కావాల్సిన విధంగా ఎడిటింగ్ చేసుకుని వైరల్ చేయాలని చేయాలని భావించడం కరెక్టు కాదని అంటున్నారు. అదే సమయంలో ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. తన స్థానంలో పార్టీలో ఎదిగిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని చూసి ఓర్వలేకే విజయసాయిరెడ్డి ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేతలు మండిపడుతున్నారు.

ఇదే సమయంలో విజయసాయిరెడ్డి విమర్శలను అధికార పార్టీ హైలెట్ చేస్తోందని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం వైసీపీకి చెందిన జోగి రమేష్ కుటుంబం మతం మార్చుకుందన్న విషయం వెలుగు చూడగా, మంత్రి పదవి కోసమే ఆయన మత మార్పిడి జరిగిందని ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ ప్రచారానికి బలం చేకూర్చేలా విజయసాయిరెడ్డి ప్రశ్నలు సంధిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు రాస్తుండటం ద్వారా ఒక వ్యూహం ప్రకారం వైసీపీ వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# జగన్ రాజకీయం చెయ్...సీనియర్లు కోరేది ఇదేనా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** అదేంటి జగన్ రాజకీయాల్లోనే కదా ఉన్నది, మళ్లీ ఇదేమిటి అన్న సందేహం రావచ్చు. అయితే జగన్ రాజకీయాల్లో ఉన్నా కూడా పక్కా వ్యూహాలతో ఎత్తుగడలతో రాజకీయం చేయాల్సిన అవసరం ఉంది అన్నదే సీనియర్ల మాట. వైసీపీ విషయం తీసుకుంటే జగన్ అధినేతగా ఉన్నారు. ఇక పార్టీ దైనందిన వ్యవహారాలు చూసేందుకు పార్టీ నుంచి వెళ్ళిపోయిన విజయసాయిరెడ్డి లాంటి వారు చెప్పే కోటరీ ఒకటి ఉందని అంటున్నారు. అన్ని విషయాలను సజ్జల రామక్రిష్ణారెడ్డి వంటి వారే చూసుకుంటున్నారు అని అంటున్నారు. ఇక జిల్లాల విషయానికి వచ్చేసరికి రీజనల్ కో ఆర్డినేటర్లను మూడేసి జిల్లాలకు నియమించారు. వారు అక్కడి విషయాలను పర్యవేక్షిస్తారు. ఇలా కొందరు సీనియర్ నేతల చేతిలో పార్టీని పెట్టేసినట్లుగా ఉందని అంటున్నారు. అక్కడ వారు ఏమి చెబితే అదే జరుగుతోందని అంటున్నారు. దాంతో జగన్ మీద వైసీపీ మీద అభిమానం ఉన్న వారు కూడా వైసీపీలో కొనసాగే పరిస్థితులు లేకుండా పోతున్నాయని అంటున్నారు.



**నేరుగా అనుసంధానం :**

అధినాయకుడు పార్టీ నాయకులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. అలాగే పార్టీలో ఎక్కడ ఏమి జరుగుతుంది అన్నది కూడా ఆయన గమనిస్తూ ఉండాలని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ నాయకుడి చెవికి చేరాలి. అయితే వైసీపీలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఎన్నో అంచెలను వైసీపీలో ఏర్పాటు చేశారు. వాటిని దాటుకుని జగన్ ని చేరడం కష్టం అవుతోంది అని అంటున్నారు. అధికారంలో ఉన్నపుడు కూడా జగన్ అపాయింట్మెంట్ చాలా మంది పెద్దలకే దొరకడం కష్టంగా మారింది అని చెబుతారు. ఇప్పుడు ఓడిన తరువాత కూడా అంతే అన్నట్లుగా ఉందని గుర్తు చేస్తున్నారు.

**పార్టీని నమ్ముకుని :**

ఒక రాజకీయ పార్టీని ఎవరైనా స్థాపించవచ్చు. అయితే ఆ పార్టీని నమ్ముకుని ఎంతో మంది చేరుతారు. వారి ఆకాంక్షలు అన్నీ కూడా పార్టీ అధినాయకత్వం పార్టీ నడిపే తీరుని బట్టే నెరవేరే అవకాశం ఉంది. అందరి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఆమోదయోగ్యమైన తీరులో పార్టీని నడిపితేనే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. పార్టీ తీరుని మార్చుకునేందుకు నిరంతరం సమీక్షలు కూడా అవసరం అని అంటున్నారు. ఇదిలా ఉంటే వర్గ పోరు ప్రతీ జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఉంది. దాంతో వైసీపీ బలంగా ఉన్న చోట కూడా వీక్ అయిపోతోంది అని అంటున్నారు.

**అధినాయకత్వం జోక్యంతో :**

శ్రీకాకుళం జిల్లాలో చూస్తే ధర్మాన సోదరులే జిల్లా పార్టీ మీద మొత్తం పెత్తనం చేస్తున్నారు అని తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ ఆరోపిస్తున్నారు. ఈ ధోరణి మంచిది కాదని ఆయన అంటున్నారు. ఇలా రెండు కీలక వర్గాలు రెండు సామాజిక వర్గాల మధ్య వైసీపీ జిల్లాలో చీలిపోయి అవస్థలు పడుతోంది. వైసీపీ అధినాయకత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది కదా అని అంటున్నారు.విజయనగరం జిల్లాలో కూడా అసంతృప్తి తారస్థాయికి చేరిన మీదటనే చిన్న శ్రీను పార్టీని వీడారని గుర్తు చేస్తున్నారు. ఇపుడు శ్రీకాకుళంతో పాటు అనేక జిల్లాలలో ఇదే రకమైన వాతావరణం ఉందని అంటున్నారు.

**రాజకీయమే చేయాలి :**

రాజకీయం అనేది ఒక క్రీడ. ఇక్కడ ఎవరికి నచ్చినట్లుగా వారు ఆడడానికి లేదు. ఈ ఆటకు సిద్ధపడితే ప్రత్యర్థి వ్యూహాలను ఎత్తులను గమనించి దానికి తగినట్లుగా పై ఎత్తులు వేయాలి. అంతే స్థాయిలో రాజకీయం చేయాలి. అలా కాదు అని మడి కట్టుకుని కూర్చుంటే రాజకీయం ఎప్పటికీ పండదని అంటున్నారు. తాజాగా మాజీ మంత్రి కొడాలి నాని కూడా జగన్ విషయంలో మాట్లాడుతూ ఆయన రాజకీయ నాయకుడు కారు అనేశారు. తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టుకుని నడుపుతున్నారని చెప్పారు. అలా అనుకుంటే వైసీపీ రాజకీయ క్షేత్రంలో ప్రత్యర్థి వేసే ఎత్తులకు చిత్తు అవుతూనే ఉంటుంది అన్నది కూడా సీనియర్ల మాటగా ఉంది. జగన్ తీరు మారాలని అంటున్నారు. ముల్లుని ముల్లుతోనే కోయాలి అన్నట్లుగా ఏపీలో రాజకీయానికి తగిన విధంగా వైసీపీ కూడా ధీటుగా స్పందించాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ కు లైఫ్ వచ్చేనా

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి అధిష్ఠానం ఇన్‌ఛార్జ్ ల మార్పు ప్రక్రియను పూర్తి చేసింది. శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ, మాణిక్యం ఠాగూర్ స్థానంలో కర్ణాటకకు చెందిన సీనియర్ నేత పీసీ మోహన్‌ను ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఏఐసీసీ నియమించింది. అయితే, 2014 రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ ఘోరంగా పడిపోయిన విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పునాదులు కదిలిపోయిన చోట కేవలం పర్యవేక్షకులను, ఇన్‌ఛార్జ్‌లను మార్చడం వల్ల పార్టీకి కొత్త ఊపిరి వస్తుందా అంటే.. ప్రయోజనం శూన్యమనే సమాధానమే వస్తోంది. ఏపీ విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోర్ ఓట్ బ్యాంక్ ఉండేది. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలు , దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులు కాంగ్రెస్‌కు వెన్నెముకగా నిలిచారు. కానీ, విభజన పర్యవసానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. ఆ సాంప్రదాయ ఓటు బ్యాంక్ మొత్తాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలోకి మళ్లించుకుంది. గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీకి అదే ప్రధానమైన బలంగా మారింది. కాంగ్రెస్ పునర్వైభవం సాధించాలంటే ఆ కోల్పోయిన పునాదిని మళ్లీ దక్కించుకోవడం ఒక్కటే మార్గం, కానీ ఆ దిశగా పార్టీ కేంద్ర నాయకత్వం సీరియస్ ప్రయత్నాలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి.రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి స్పష్టమైన క్షేత్రస్థాయి వ్యూహం లేకపోవడమే అతిపెద్ద బలహీనత. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు లేదా అసెంబ్లీ వేళల్లో ప్రెస్ మీట్లు పెట్టడం, సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేయడానికే రాష్ట్ర నాయకత్వం పరిమితమవుతోంది. వైఎస్ షర్మిలకు ఏపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తర్వాత కొంతవరకు మీడియా మైలేజ్, క్యాడర్‌లో కొంత చలనం వచ్చినా.. అది ఓట్ల రూపంలోకి లేదా వైఎస్సార్‌సీపీ కోర్ ఓటు బ్యాంకును ఆకర్షించే స్థాయిలోకి మారలేదు. అసలైన జనాకర్షక నేతలు, క్షేత్రస్థాయిలో బలం ఉన్న స్థానిక నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ విస్తరణ ఆగిపోయింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు, రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఓటు బ్యాంకు స్వరూపం ఒకటే. కానీ ఏపీలో వైఎస్ఆర్‌సీపీని విమర్శించే క్రమంలో కాంగ్రెస్ పార్టీ టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి అనుకూలంగా ఉందనే భావన సాధారణ ప్రజల్లోకి వెళ్తోంది. ప్రత్యేకించి బీజేపీతో టీడీపీ పొత్తులో ఉన్న తరుణంలో, బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌కు మంచి అవకాశం ఉన్నప్పటికీ, కూటమి వైఫల్యాలపై ధ్వజమెత్తడంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉండటం లేదనే విమర్శ ఉంది. ఈ వ్యూహాత్మక అయోమయం వల్ల మైనారిటీ, దళిత వర్గాలు కాంగ్రెస్ వైపు చూడటానికి వెనుకాడుతున్నాయి.కర్ణాటకకు చెందిన పీసీ మోహన్ నాయకత్వంలోనైనా ఏపీ కాంగ్రెస్ రూట్ మ్యాప్ మారుతుందా అన్నది ఇప్పుడు సవాలు. కర్ణాటకలో కాంగ్రెస్ సాధించిన విజయం, అక్కడ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల మోడల్‌ను ఏపీ ప్రజల్లోకి తీసుకెళ్లడం మోహన్‌కు కొంతవరకు కలసివచ్చే అంశం. అయితే, కేవలం విజయవాడ లేదా అమరావతిలోని పార్టీ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడానికే ప్రాధాన్యత ఇస్తే ఎలాంటి ఫలితం ఉండదు. బూత్ స్థాయి నుంచి కమిటీలను పునర్నిర్మించడం, కూటమి ప్రభుత్వం , ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ రెండింటికీ సమదూరం పాటిస్తూ సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం తక్షణ అవసరం. రూట్ లెవల్‌లో నాయకత్వాన్ని తయారు చేయకుండా, డివైడ్ అయిన సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆకట్టుకునేలా స్పష్టమైన ఆర్థిక-సామాజిక విధాన ప్రకటనలు చేయకుండా.. ఇన్‌ఛార్జ్‌లను ఎంతమందిని మార్చినా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోతుంది. కొత్తగా వచ్చిన పీసీ మోహన్ అయినా కేవలం ఢిల్లీ మార్గదర్శకాలను అమలు చేసే ప్రతినిధిగా మిగలకుండా, ఏపీ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

## అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

**గుంటూరు, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

## లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం

**తిరుపతి, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు. కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు. అయినా 34% జీవో ఇవ్వడం వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రభుత్వం తమ వైపు నుంచి 34% అమలుకు సిద్ధపడింది అన్న సందేశాన్ని ప్రజలకు ఇవ్వడం. ఒకవేళ కోర్టు దీనిని అడ్డుకుంటే, మేము ఇవ్వాలనుకున్నాం కానీ న్యాయస్థానాల పరిమితుల వల్ల కుదరలేదు అని చెప్పి బీసీల్లో సానుభూతి సాధించడం. సీలు టీడీపీకి సాంప్రదాయ వెన్నెముక. జీవో ఇవ్వడం, సభలు నిర్వహించడం ద్వారా తమ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని బలంగా స్థాపించడంవైఎస్ జగన్ విమర్శలు కేవలం న్యాయ సూత్రాల గురించే కావు. దాని వెనుక స్పష్టమైన ప్రతిపక్ష వ్యూహం దాగి ఉంది. 2019-2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 50% పరిమితికి లోబడి బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది. అప్పట్లో టీడీపీ దీనిని బీసీల నోళ్లు కొట్టారు అని విమర్శించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34% జీవో ఇస్తే, తాము గతంలో చేసింది కోర్టు నిబంధనల కోసమేనని నిరూపించుకోవాల్సిన అవసరం జగన్‌కు వచ్చింది. అలాగే, రిజర్వేషన్ల వివాదం వల్ల ఎన్నికలు ఆలస్యమైతే, కూటమి ప్రభుత్వం ఎన్నికల నుంచి పారిపోతోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది వైఎస్ఆర్‌సీపీ ఆలోచన.న్యాయ కోణం నుంచి చూస్తే, ఎంపిక చేసిన ప్రాతిపదికన ఎంపిరికల్ డేటా అంటే సామాజిక, ఆర్థిక సర్వే డేటా ఆధారంగా బీసీల వెనుకబాటుతనాన్ని నిరూపిస్తే తప్ప 50% సీలింగ్ దాటడం సాధ్యం కాదు. ఈ విషయంపై ఏపీ హైకోర్టు కూడా ప్రభుత్వం వైపు నుంచి ఆధారాలను, ఎంపిరికల్ డేటాను కోరింది. ప్రత్యేక కమిషన్ల నివేదికలు లేకుండా జీవో ఆధారంగా 50% మించి రిజర్వేషన్లు ఇస్తే, గతం తరహాలోనే న్యాయస్థానాలు దానిని నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏపీ స్థానిక పోరులో బీసీ రిజర్వేషన్ల అంశం చట్టపరమైన సవాలు కంటే రాజకీయ అస్త్రంగా ఎక్కువ ఉపయోగపడుతోంది. 34% కోటాను దక్కించుకోవడం ద్వారా బీసీల గుండెల్లో చెరగని ముద్ర వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంటే.. ఇది సాధ్యం కాని రాజకీయ గిమ్మిక్ అని తేల్చిచెప్పడం ద్వారా టీడీపీ-బీజేపీ-జనసేనల ఇమేజ్‌ను దెబ్బతీయాలని వైఎస్ఆర్‌సీపీ చూస్తోంది. అంతిమంగా, కోర్టు ఇచ్చే తీర్పు స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను నిర్ణయించడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో బీసీ ఓటు బ్యాంక్ ఎటువైపు మొగ్గుతుందో స్పష్టం చేయనుంది.

## ఆరోపణలు... ప్రత్యారోపణలు డీఎస్సీకి కథ ముగింపు ఎప్పుడు

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం ఎంత ఓపికగా, పారదర్శకంగా వివరణలిస్తున్న కొద్దీ.. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి వర్గం ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణల రాళ్లు విసురుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సమాచారానికి వాస్తవాలతో కూడిన రివర్స్ కౌంటర్లు వస్తున్నాయని, తాము లేవనెత్తుతున్న అంశాలన్నీ గాల్లో దీపాలేనని ఆ పార్టీ నాయకులకు కూడా బాగా తెలుసు. అయినప్పటికీ ప్రజల్లో ఏదో ఒక అభూతకల్పనను నిరంతరం సజీవంగా ఉంచాలనే దుర్బుద్ధితో జగన్ రెడ్డి అండ్ కో ఈ తప్పుడు ప్రచారాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. కేవలం తమ అబద్ధాలను పదే పదే ప్రచారం చేసుకుంటూ కాలం వెళ్లదీయడమే లక్ష్యం.ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోతే తాము ఆడే డ్రామాలే నిజమని జనం నమ్ముతారనే భయంతో, ప్రభుత్వం ప్రతి చిన్న అంశానికీ ఆధారాలతో సహా వివరంగా సమాధానమిస్తోంది. అయితే దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వైసీపీ, అదే అలుసుగా తీసుకుని ప్రతి దానిని డీఎస్సీ స్కాం అంటూ ప్రజల మైండ్‌లో రుద్దడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రజా సమస్యలపై సద్విమర్శలు చేయడం మానేసి, కేవలం నిరుద్యోగుల ఆశలతో ఆడుకునేలా నిత్యం ఏదో ఒక వివాదాన్ని రగిలించడమే ఏకైక అజెండాగా మార్చుకుంది.ఈ కుట్రపూరిత ప్రచారంలో భాగంగా మొదట పేపర్ లీక్ అంటూ నానా హంగామా సృష్టించారు; కానీ అది ఎక్కడా నిలవకపోవడంతో వెంటనే యూటర్న్ తీసుకుని ఒకే కులానికి చెందినవారికి ఉద్యోగాలొచ్చాయంటూ' విషం చిమ్మారు. ఆ విమర్శ కూడా పటాపంచలు కావడంతో, ఇప్పుడు ఏకంగా స్పోర్ట్స్ కోటా అంశాన్ని పట్టుకుని వేలాడుతున్నారు. అసలు ఖోఖో కూడా ఒక ఆట కింద లెక్కేనా అంటూ జగన్ రెడ్డి స్వయంగా ఎద్దేవా చేయడం, క్రీడాకారుల ప్రతిభను కించపరిచేలా మాట్లాడటం చూస్తుంటే.. వినేవాళ్లు నవాబుల కాలం నాటి ఈ జోకులను ఎందుకు సీరియస్‌గా తీసుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది. కేవలం తమ రాజకీయ మనుగడ కోసం రాష్ట్రంలోని క్రీడాకారుల భవిష్యత్తును, పారదర్శకంగా భర్తీయవుతున్న ఉపాధ్యాయ నియామకాలను బలిపెట్టడానికి కూడా ఆ పార్టీ వెనుకాడటం లేదు.వైసీపీ ఆడుతున్న ఈ విషపూరిత డ్రామాలు, పన్నే ప్లాన్లకు ప్రభుత్వం ఇకనైనా పూర్తిస్థాయిలో చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. రోజువారీ రాజకీయ మైలేజ్ కోసం చేస్తున్న ఈ ఆరోపణలను ఎక్కడికక్కడ చట్టపరంగా, కఠినంగా నిలువరించాల్సిన అవసరం ఉంది. కేవలం మీడియా చర్చలకు వదిలేయకుండా, కోర్టుల్లో ఏమాత్రం నిలవని, కేవలం బురదజల్లే ఈ నకిలీ డిబేట్లను తక్షణం న్యాయపరమైన చర్యలతో అడ్డుకోవాలి. లేదంటే ఈ అబద్ధాల ప్రచారమే నిజమనే భ్రమను కల్పించడంలో వారు సఫలమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తన పాలనా దక్షతను, పారదర్శకతను చాటుకుంటూనే.. వ్యవస్థలను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్న ఈ పాత రాజకీయ శైలిని ఉక్కుపాదంతో అణచివేయాలి. నిరుద్యోగుల ఉసురుపోసుకునేలా రోజుకో డ్రామా ఆడుతున్న వైసీపీకి ప్రజాక్షేత్రంలోనూ, చట్టం ముందూ తగిన బుద్ధి చెప్పినప్పుడే ఇలాంటి నిరాధార రాళ్ల క్రీడలకు శాశ్వత బ్రేక్ పడుతుంది.

# జాతీయ గర్వం అహంకారంగా మారితే.. గెలుపుకు ప్రాధాన్యత ఉండదు:

## భారత్ ట్రోఫీ నిరాకరణపై మహమ్మద్ యూసఫ్

**ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు**

**నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరించేందుకు నిరాకరించిన టీమ్**

**వినయం లేని దేశం గెలిచినా ఓడిపోయినట్టే అన్న యూసఫ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది పురుషుల ఆసియా కప్ సమయంలోనూ భారత పురుషుల జట్టు నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోకుండా సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత మహిళల జట్టు కూడా అదే బాటలో పయనించి నఖ్వీకి షాక్ ఇచ్చింది.దుబాయ్‌లో జరిగిన ఫైనల్ పోరులో శ్రీలంకపై 72 పరుగుల తేడాతో విజయం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోకూడదనే నిర్ణయం వెనుక బీసీసీఐ ముందస్తు వ్యూహం ఉంది.

ఈ ట్రోఫీ నిరాకరణ ఘటనపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించాడు. "జాతీయ గర్వం కాస్తా అహంకారంగా మారినప్పుడు, గెలుపునకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు. జట్టు గెలవవచ్చు, కానీ వినయం లేని దేశం ఓడిపోయినట్టే" అని ట్వీట్ చేశాడు.మోహ్సిన్ నఖ్వీని ప్రశంసిస్తూ యూసఫ్ చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ట్రోఫీ తీసుకోకపోవడంపై బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పందిస్తూ ఇది బోర్డు తీసుకున్న సంస్థాగత నిర్ణయమని స్పష్టం చేశారు. వేడుకల్లో పాల్గొనకూడదనే విషయాన్ని ఏసీసీకి ముందే అధికారికంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత చోటుచేసుకున్న సైనిక ఉద్రిక్తతల దృష్ట్యా దేశప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది ఆటగాళ్లకు లేదా క్రీడకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోని వ్యూహాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

# ఫ్రాంచైజీల విజ్ఞప్తి.. ఇకపై ఇండియాలోనే ఐపీఎల్ మినీ వేలం

**స్వదేశానికి తిరిగి రానున్న ఐపీఎల్ మినీ వేలం**

**ఫ్రాంచైజీల విజ్ఞప్తితో పాలకమండలి నిర్ణయం**

**2024 నుంచి దుబాయ్, జెడ్డా వంటి నగరాల్లో వేలం**

**వేదికపై ఇంకా రాని స్పష్టత**

**ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కొనసాగుతున్న చర్చ**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలాన్ని తిరిగి భారత్‌లోనే నిర్వహించాలని ఐపీఎల్ పాలకమండలి (జీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. 2024 నుంచి ఐపీఎల్ వేలాన్ని దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలం కోసం తమ బృందాలను విదేశాలకు తరలించడం రవాణా పరంగా, నిర్వహణాపరంగా సవాలుగా మారుతోందని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్, 2027 మినీ వేలాన్ని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, వేలం నిర్వహించే నగరాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా హోటల్ గదుల లభ్యతను బట్టి వేదికను ఖరారు చేయనున్నారు. మినీ వేలాన్ని భారత్‌కు మార్చినప్పటికీ, ఆ తర్వాతి ఏడాది జరిగే మెగా వేలాన్ని మాత్రం విదేశాల్లోనే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమావేశంలో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా పాలకమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధనపై ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను స్వీకరించి, తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది.


# 2027 ప్రపంచకప్ గెలవాలంటే ఆ తప్పులు చేయొద్దు.. టీమిండియాకు యువరాజ్ కీలక సలహా



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టు యాజమాన్యానికి మాజీ ఆల్-రౌండర్, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కీలకమైన సలహాలు ఇచ్చాడు. టోర్నమెంట్‌కు ముందు చివరి నిమిషంలో జట్టులో భారీ మార్పులు చేయడం మానుకోవాలని, ఇప్పటి నుంచే ఒక కోర్ జట్టును గుర్తించి వారిపై నమ్మకం ఉంచాలని సూచించాడు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళితేనే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు.క్రిక్ఇన్ఫోతో మాట్లాడుతూ యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "భారత జట్టు కీలక టోర్నీలలో విఫలమైన ప్రతీసారి, దానికి కారణం చివరి నిమిషంలో భారీ మార్పులు చేయడమే. కాబట్టి 2027 ప్రపంచకప్ గెలవగలదని మనం నమ్మే జట్టును ఎంచుకుని, టోర్నీ వరకు వారికే అండగా నిలవడం చాలా ముఖ్యం. వారు గెలిచినా, ఓడినా జట్టుపై నమ్మకం ఉంచాలి" అని యువరాజ్ వివరించాడు.ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో 50 ఓవర్ల మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. అందువల్ల ఎంపిక చేసిన ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలంటే, రాబోయే ఏడాది కాలంలో వారికే స్థిరంగా అవకాశాలు కల్పించాలని అన్నాడు. 12 నుంచి 14 మందితో కూడిన అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుని, మైదానం, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేయవచ్చని తెలిపాడు.గతంలో ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌లు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమేనని యువరాజ్ ఉదహరించాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించాడు.

ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే విధానాన్ని అనుసరించిందని, స్థిరమైన జట్టుతో బరిలోకి దిగడం వల్లే విజయం సాధ్యమైందని యువీ విశ్లేషించాడు. 2027 ప్రపంచకప్ కోసం కూడా ఇదే తరహా వ్యూహంతో ముందుకు సాగాలని జట్టు యాజమాన్యానికి సలహా ఇచ్చాడు.

# ట్రెండీ టాక్: 50 ప్లస్ హీరోలకు 'ఇరుముడి' నేర్పిన పాఠం





సినిమా రంగంలో స్టార్ హీరోల వయసు మారుతున్న కొద్దీ వారి పాత్రల ఎంపికలోనూ పరిణతి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరోసారి ప్రూవ్ అయింది. తమ వయసుకు తగిన పాత్రలు చేస్తేనే ఎంత పెద్ద హీరోనైనా ప్రేక్షకులు తెరపై ఆదరిస్తారని.. లేదంటే ప్రేక్షకుల నుంచి ఘోరమైన తిరస్కారం తప్పదని గత పరిణామాలు స్పష్టం చేసాయి. రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు బిగ్ డిబేట్ కి కారకం. పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు ఉన్నప్పటికీ ఇంకా యువ హీరోయిన్లతో రొమాంటిక్ లవ్‌స్టోరీల్లో నటిస్తున్న 60 ప్లస్ హీరోలకు ఇదొక పెద్ద కనువిప్పు లాంటి పరిణామం. మన పరిశ్రమలో ఉన్న 50 ప్లస్ హీరోలు ఇకపై రొమాంటిక్ పాత్రలను పక్కన పెట్టి.. కథకు బలమైన డాడీ పాత్రల్లో.. బాధ్యతాయుతమైన రోల్స్‌లో నటించాల్సిన సమయం ఆసన్నమైంది.ఇప్పటివరకు ఇద్దరేసి హీరోయిన్లతో ప్రేమలో నిండా మునిగి, రొమాన్స్ చేయడంలో బిజీగా ఉన్న మాస్ మహారాజా రవితేజ ఇటీవల -ఇరుముడి- చిత్రంలో మొదటిసారి కూతురిని అమితంగా ప్రేమించే బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో నటించారు. తెరపై ఆయనలోని ఈ విప్లవాత్మక మార్పును ప్రేక్షకులు ఎంతో మనసారా స్వాగతించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం ఉన్న తండ్రి పాత్రను ఎంచుకోవడం వల్ల ఆ సినిమా ఘనవిజయం సాధించడమే కాకుండా.. నటుడిగా అతడి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.ఈ విజయంతో 50 ప్లస్, 60 ప్లస్ హీరోలందరూ ఇకపై తమ వయసుకు తగిన పాత్రలనే ఎంచుకోవాల్సి ఉంటుందనే సూచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇండస్ట్రీ దిగ్గజ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లు ఇప్పటికే చాలావరకు తమ వయసుకు తగినట్లు పరిణతి ఉన్న విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ దూసుకెళుతున్నారు. నాగార్జున సైతం ప్రయోగాత్మక కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'ఇరుముడి' తరహాలో భావోద్వేగాలతో కూడిన తండ్రి పాత్రలు ఈ సీనియర్ హీరోలందరికీ కూడా వందశాతం సూటబుల్ ఆప్షన్‌గా మారుతున్నాయి.

అలా కాకుండా పాత పద్ధతిలోనే ఇంకా హీరోయిన్లతో లవ్వాయణాలు, రొమాంటిక్ కామెడీలు చేస్తూ పోతే నేటి ప్రేక్షకులు నిర్దయంగా తిరస్కరిస్తున్న ఉదాహరణలు చూస్తూనే ఉన్నాం. నేటి మాస్ ఫ్యాన్స్ కూడా ఓటీటీలు, వెబ్ సిరీస్‌లు, హాలీవుడ్ సినిమాలు, లైవ్ సిరీస్ లు విపరీతంగా చూస్తూ పూర్తిగా అప్‌గ్రేడ్ అయ్యారు. వారి అభిరుచులు మారడంతో రొటీన్ కమర్షియల్ ఫార్ములా సినిమాలు బెడిసికొడుతున్నాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ వంటి దిగ్గజాలు కూడా గ్లామర్ పాత్రలను పక్కన పెట్టి తమ వయసుకు తగ్గ పరిణతి ఉన్న తండ్రి లాగానో లేదా వయసుకు తగ్గ పాత్రల్లోను నటిస్తుండటం గమనార్హం.మొత్తానికి ఏజ్ పెరుగుతున్న కొద్దీ స్టార్ హీరోలు తమ పంథాను మార్చుకోవాల్సిన టైమ్ వచ్చేసింది. హాలీవుడ్ హీరోల మాదిరిగా మారుతున్న కాలానికి తగినట్లు తమ ఇమేజ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో మైలేజ్ పెంచుకోవడమే సీనియర్ హీరోలకు సరైన మార్గం. కేవలం డ్యాన్సులు, రొమాన్స్ చుట్టూ తిరగకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటేనే బాక్సాఫీస్ వద్ద విజయం సొంతమవుతుందని నిరూపణ అయింది. ఇరుముడి నేర్పిన పాఠం టాలీవుడ్ 50 ప్లస్ హీరోలకు నిజంగానే కలిసి వస్తుందని ఆశిద్దాం.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965